# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :267 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 04-01-2026 | పేజీలు:4 వెల: 2.00


## ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు...

హైదరాబాద్,ఈ నెలాఖరు కల్లా మున్సిపాలిటీల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని మున్సిపల్ ఎన్నికలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో చిట్‌చాట్ చేశారు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్. గత రెండు సంవత్సరాలుగా బీఆర్ఎస్ నేతల వ్యవహార శైలి చూస్తున్నామని.. వారి పంతం నెగ్గించుకోవడానికి ఏమైనా చేస్తారని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే ముఖం బీఆర్ఎస్ నేతలకు లేదని ఎద్దేవా చేశారు. తమ తప్పు ఉంటే అసెంబ్లీలో నిరూపించాలని సవాల్ విసిరారు. మూసీ అంశంలో బీఆర్ఎస్ నేతలే రన్నింగ్ కామెంటరీ చేశారని ప్రస్తావించారు. బీఆర్ఎస్ ప్రభావం కోల్పోయిందని.. ఉనికి కాపాడుకోవడానికి ఆ పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.రేగా పథకంపై, బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడలేక బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పేదవారి పథకం గురించి బీఆర్ఎస్ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం

## ఇదే కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు ఉన్న తేడా.. ఉత్తమ్‌పై హరీశ్‌రావు ధ్వజం



హైదరాబాద్,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ఆడియో, వీడియో ప్రజెంటేషన్ నిర్వహిస్తే సభకు హాజరుకాబోమని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాసిన లేఖ గుర్తుందా అని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా 30-03-2016 న మీరు స్పీకర్‌కు రాసి సంతకం పెట్టిన ఉత్తరం గుర్తుందా? అని నిలదీశారు. "అసెంబ్లీలో ఆడియో-విజువల్ ప్రెజెంటేషన్ నిర్వహిస్తే, అది భారత దేశ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధం. అందుకే మేము సభకు హాజరుకాబోము." అని నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా లేఖ రాసి.. నేడు మంత్రి హోదాలో అసెంబ్లీ హాలులో ప్రజెంటేషన్‌కు సిద్ధపడటం.. మీ రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ఆ ఉత్తరంపై నేటి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పద్మావతి సంతకాలు చేశారని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనైతికత, ద్వంద్వ ప్రమాణాలను ఈ ఒక్క ఉత్తరం బట్టబయలు చేస్తుందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువలు, రాజ్యాంగం, పార్లమెంట్ సూర్తి వంటి మాటలు వల్లెవేస్తారని.. అధికారంలోకి రాగానే అదే విలువలకు తిలోదకాలు ఇస్తారని మండిపడ్డారు. ఇదే కాంగ్రెస్ పార్టీ అసలు నైజమని వ్యాఖ్యానించారు.అధికార పక్షానికి ప్రజెంటేషన్‌కు అనుమతినిస్తే.. బీఆర్ఎస్‌కూ అదేవిధంగా అనుమతి ఇవ్వాలని బీఏసీ సమావేశంలో, ఉత్తరం ద్వారా స్పీకర్‌ను కోరామని హరీశ్‌రావు తెలిపారు. అయినప్పటికీ ఆ అభ్యర్థనను స్పీకర్ తిరస్కరించారని పేర్కొన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి మధ్య ఉన్న అసలు తేడా అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. కాంగ్రెస్ అన్ని సంప్రదాయాలు, పద్ధతులు, మర్యాదలకు భంగం కలిగిస్తూ.. రాజ్యాంగానికే తూట్లు పొడవడాన్ని తన మార్పుగా చూపిస్తోందని ఎద్దేవా చేశారు. ఆ మార్పు అసలు అర్థం ఏమిటో ప్రజలు ఇప్పుడు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

## సభకు రావాలని కేసీఆర్‌కు ఆహ్వానం వెనుక సీఎం రేవంత్ వ్యూహం ఏంటి?

హైదరాబాద్, దమ్ముంటే అసెంబ్లీకి రా. అన్ని అంశాలపై చర్చిద్దాం. ఓడగొడితే ప్రజల ముఖం చూడవా అంటూ..కేసీఆర్ ఇగోను టచ్ చేస్తున్నారు సీఎం రేవంత్. గులాబీ బాస్ మాత్రం రేవంత్ వ్యూహానికి చిక్కకుండా సభకు రాకుండానే తన సెంట్రిక్‌గానే చర్చ జరిగేలా స్కెచ్ వేశారట. దీంతో కేసీఆర్ అసెంబ్లీకి వచ్చేలా రేవంత్ ఇంకా ప్రెజర్ పెంచుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. లేటెస్ట్‌గా ఎమ్మెల్సీ కవిత కూడా కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిందే అనడం హాట్ టాపిక్ అవుతోంది. సభకు రాకుండానే సార్ లైమ్‌లైట్‌లో ఉండే ప్లాన్ చేస్తున్నారా? ఏం చేసైనా కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించాలనేది రేవంత్ వ్యూహమా?

మొన్నటి వరకు గులాబీ దళపతి మౌనం తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా కొనసాగింది. లేటెస్ట్‌గా సార్ మీడియా ముందుకు వచ్చారు. కృష్ణా? జలాలు, పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతలపై స్ట్రాంగ్ వాయిస్ వినిపించి చర్చకు తెరలేపారు. ఆ తర్వాత అసెంబ్లీ సెషన్ స్టార్టింగ్ రోజు సభకు అటెండ్ అయి ఇంకా క్యూరియాసిటీ పెంచేశారు. అసెంబ్లీలో చర్చలో పాల్గొనేందుకు కేసీఆర్ వస్తున్నారంటూ లీకులు వచ్చాయి. కానీ శుక్రవారం జరిగిన సభకు సార్ రాలేదు. సెంబ్లీకి హాజరైన బీఆర్ఎస్ శాసనసభ్యులు కూడా తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని వాకౌట్ చేశారు.

**కేసీఆర్ అసెంబ్లీకి వచ్చేలా ఒత్తిడి తేవాలని పిలుపు..**

అయితే కేసీఆర్ అసెంబ్లీకి రావాలంటూ ఎత్తుకున్న రాగాన్ని ఎంతకు వదిలి పెట్టడం లేదు సీఎం రేవంత్. పదేపదే సవాళ్లు విసురుతున్నారు. పైగా మీరు సభకు రండి..సలహాలు..సూచనలు ఇవ్వండి అంటూ పిలుపిస్తున్నారు. అంతటితో ఆగకుండా కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఆయన గౌరవానికి ఎలాంటి భంగం కలిగించబోమని హామీ ఇస్తున్నారు రేవంత్. గత సర్కార్ హయాంలో జరిగిన తప్పిదాలపై చర్చించేందుకు కేసీఆర్ సభకు రావాలని అంటున్నారు. అంతేకాదు కేసీఆర్ అసెంబ్లీకి వచ్చేలా తెలంగాణ ఉద్యమకారులు ఒత్తిడి తేవాలని కూడా రేవంత్ చెప్పుకొస్తున్నారు. మంత్రి వివేక్, ప్రభుత్వ సలహాదారు కేకే లాంటి తెలంగాణ ఉద్యమకారులు కేసీఆర్ అసెంబ్లీకి వచ్చేలా ప్రెస్‌మీట్ పెట్టాలంటూ స్వయంగా రేవంతే సూచించడం ఆసక్తికరంగా మారింది.లేటెస్ట్‌గా సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికీ ఎన్నో సార్లు కేసీఆర్‌కు సవాల్ చేశారు రేవంత్. అయినా కేసీఆర్ మాత్రం రేవంత్ సవాల్‌ను స్వీకరించి అసెంబ్లీకి రావడం లేదు. అసలు రేవంత్ పేరెత్తి మాట్లాడేందుకు సార్ ఇష్టపడట్లేదంటున్నాయి గులాబీ శ్రేణులు. రేవంత్ మాత్రం ఏం చేసైనా కేసీఆర్‌ను



అసెంబ్లీకి రప్పించే స్కెచ్ వేస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది.

**కేసీఆర్ రాకపోతే బీఆర్ఎస్ పని ఖతం..**

కేసీఆర్ గౌరవానికి భంగం కలగకుండా చూసుకుంటానని చెప్తూనే.. దమ్ముంటే అసెంబ్లీకి రా అని సవాల్ విసరడం వెనక..పెద్ద ఎత్తుగడే ఉందన్న చర్చ జరుగుతోంది. అయితే లేటెస్ట్‌గా ఎమ్మెల్సీ కవిత కూడా సీఎం రేవంత్ లాగే..కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిందే అంటుండటం చర్చకు దారితీస్తోంది. అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ వచ్చి సమాధానం చెప్పకపోతే బీఆర్ఎస్ పని ఖతం అంటూ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తప్పు చేయకపోతే సభకు రావాల్సిందే అంటున్నారు కవిత. సభకు రాకుండా పిల్ల కాకుల మీద సభా సమయాన్ని వదలొద్దంటూ హితవు పలికారు.ఇలా పార్టీ ఏదైనా..లీడర్ ఎవరైనా..అందరినోట సార్ సభకు రావాల్సిందేనన్న మాట వినిపించేలా చేయాలన్నదే రేవంత్ స్కెచ్ అంటున్నారు. ఓవైపు సీఎం రేవంత్.. కేసీఆర్ సభకు రావాలంటూ సవాళ్లతో ఇగోను టచ్ చేసే స్కెచ్ వేస్తున్నారట. ఇప్పటివరకు కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించేందుకు రేవంత్ వేసిన ఎత్తులేవి సక్సెస్ కాలేదని..అందుకే రేవంత్ కొత్త డ్రామా షురూ చేశారని గులాబీ లీడర్లు మండిపడుతున్నారు.అయితే కేసీఆర్ అసెంబ్లీకి రావాలంటూ..తెలంగాణ ఉద్యమకారులతో ప్రెస్‌మీట్ పెట్టించి ప్రజల్లో ఓ చర్చకు తెరలేపాలనేది రేవంత్ వ్యూహమట. సరిగ్గా ఇదే టైమ్‌లో కవిత కూడా కేసీఆర్ సభకు రావాల్సిందేనంటూ మాట్లాడటం హాట్ టాపిక్ అవుతోంది. ఇలా అన్ని దిక్కుల ఒత్తిడి తెచ్చి కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించేందుకు రేవంత్ వేస్తున్న ఎత్తులు ఎప్పుడు సక్సెస్ అవుతాయో చూడాలి.


## రాజకీయాలను క్రికెట్‌తో ముడిపెట్టొద్దు

న్యూఢిల్లీ, బంగ్లాదేశ్‌లో హిందువుల మీద వరుస దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ 2026 మినీ వేలంలో రికార్డు ధర రూ. 9.2 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ దక్కించుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. తాజాగా దీనిపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందించారు. 'బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై జరుగుతున్న దాడులకు, క్రికెట్‌కు ముడిపెట్టకూడదు. అయితే ఆ దేశంలో మైనార్టీలపై దాడులు ఆగేలా చర్యలు తీసుకోవాలని మేం వారి ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ముస్తాఫిజుర్ రెహమాన్ అనే వ్యక్తి క్రికెటర్. అతడికి, మైనార్టీలపై దాడులకు ఏవిధమైన సంబంధమూ లేదు. అలాగే ఈ విషయంలో అతడిపై వ్యక్తిగతంగానూ ఏ విధమైన ఆరోపణలు లేవు. దాడులు, ఐపీఎల్‌కు అతడి ఎంపిక.. ఈ రెండింటినీ కలిపి చూడటం సరైన చర్య కాదు' అని శశిథరూర్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. 'క్రీడలకు, రాజకీయాలకు ముడిపెట్టొద్దు. మన పొరుగుదేశాల వారిని దూరం పెడుతూ పోవడం.. వారితో ఆడకుండా ఉండటం ఎలా సముచితమవుతుంది? మనం బంగ్లాదేశ్‌కు మూడు వైపులా విస్తరించి ఉన్నాం. మనం వారితో ఆడాల్సిందే' అని శశిథరూర్ విశ్లేషించారు. బంగ్లాదేశ్ ఆటగాళ్లు ఐపీఎల్‌లో ఆడే విషయంలో ఫ్రాంఛైజీని తప్పుపట్టిన భాజపాని కాంగ్రెస్ నాయకుడు, కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే 'ఎక్స్' వేదికగా విమర్శించారు. 'భాజపా వారు బంగ్లాదేశ్ ఆటగాడిని ఐపీఎల్‌లో తీసుకోవడాన్ని



తప్పుపడుతున్నారు. విదేశీ ఆటగాళ్లు ఈ లీగ్‌లో ఆడుతున్నారంటే దానికి బీసీసీఐ, ఐపీఎల్ విధించిన నిబంధనలే కారణం. ఈ విషయంలో ఫ్రాంఛైజీని విమర్శించే బదులు, భాజపా నాయకులు.. బీసీసీఐనే ప్రశ్నించాలి' అని పేర్కొన్నారు. అలాగే గతంలో జరిగిన సంఘటనల గురించి కూడా ప్రస్తావించారు. 'పహల్గాం దాడి తర్వాత.. భారత్, పాక్‌తో మ్యాచ్‌లు ఆడితే భాజపా అభ్యంతరం తెలపలేదు. కొవిడ్ సమయంలో ఐపీఎల్ మ్యాచ్‌లను ఇస్లామిక్ దేశాలకు తరలిస్తే అప్పుడూ ప్రశ్నించలేదు. ఫ్రాంఛైజీలను ప్రశ్నించే బదులు.. భాజపా వారు హోమ్ మినిస్టర్‌ను అడగాలి' అని ప్రియాంక్ ఖర్గే అన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్ల అక్రమ అరెస్టు.. తీవ్రంగా ఖండించిన కేటీఆర్



హైదరాబాద్,రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్ల అక్రమ అరెస్టులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ అంశాన్ని అసెంబ్లీ దృష్టికి తీసుకువస్తామని, అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ఆటో డ్రైవర్ల జేఏసీ నేతలను, వేలాది మంది ఆటో డ్రైవర్లను అక్రమంగా అరెస్టు చేయడంపై మండిపడ్డారు. నిన్నటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లను, ఆటో యూనియన్ల నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. వేలాది మంది ఆటో డ్రైవర్లను రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీస్ స్టేషన్లలో అదుపులోకి తీసుకొని బంధించి ఉంచడం దుర్మార్గమైన చర్యగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నిస్తే, నిర్బంధాలు, అరెస్టులతో గొంతు నొక్కుతున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేసిన ఆటో యూనియన్ల నేతలను, ఆటో అన్నలను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటనను, ఆటో అన్నలు కోరినట్లుగానే ఈరోజే అసెంబ్లీలో ప్రభుత్వం చేయాలని కేటీఆర్ కోరారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు కొనసాగకుండా ఉండాలంటే, వారికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

## రగులుతున్న కుంకుమపువ్వు.. మరో దేశంలో జెన్ జీ విప్లవం!



టెహ్రాన్:జెన్ జీ.. ఈ పేరు వింటేనే పాలకులు ఉలిక్కిపడే పరిస్థితి.. అనేక దేశాల్లో పీఠాలను కదిలించిన తరం ఇది.. ఇప్పుడు మరో దేశంలోనూ జెన్ జీ ఉద్యమిస్తోంది.కుంకుమ పువ్వుకు పేరుగాంచిన ఆ దేశంలో శీతాకాలంలోనూ వేడి రగిలిస్తోంది. దాదాపు మూడున్నరేళ్ల కిందట ఇదే దేశంలో ఓ యువతి మరణంపై ప్రజలు తీవ్ర స్థాయిలో నిరసనలకు దిగారు. మళ్లీ అంతలా కాకున్నా.. ఆర్థిక పరిస్థితులపై తమ గళాలు వినిపిస్తున్నారు. ఒకవైపు హద్దు లేని ధరల పెరుగుదల, మరోవైపు రెండేళ్లుగా పడిపోతున్న కరెన్సీ విలువ..! దీంతో జీవితం భారమై యువత వీధుల్లోకి వస్తున్నారు. ప్రభుత్వం ఎప్పటిలాగానే జోక్యం చేసుకుంటోంది. పరిస్థితులు ఇలాగే కొనసాగి.. అమాయక పౌరుల ప్రాణాలు పోతే తాము రంగంలోకి దిగుతామంటూ ఏకంగా అమెరికానే హెచ్చరించింది.

**నెమ్మదిగా పాకుతున్న ఉద్యమం**

ఇరాన్.. పశ్చిమాసియాలోని ఈ కీలక దేశంలో గత ఆదివారం నుంచి ప్రజల నిరసనలు పెరుగుతున్నాయి. ప్రపంచంలో పండే కుంకుమ పువ్వులో 90 శాతం ఇరాన్ లోనే. 1970కి ముందు పాశ్చాత్య దేశాల తరహాలో ఉండేది. ఇస్లామిక్ విప్లవం అనంతరం సంప్రదాయ దేశంగా మారింది. అయితే, పాలనలో వైఫల్యాలు ఇరాన్ ను దెబ్బతీస్తున్నాయి. హిజాబ్ ధరించలేదని 2022లో ఇస్సా అమీనా అనే యువతిని దారుణంగా కొట్టి చంపడం ప్రపంచ వ్యాప్తంగా వ్యతిరేకతకు దారితీసింది. ప్రజలను రోడ్లపైకి వచ్చేలా చేసింది. ఇప్పుడు అధిక ధరలు, కరెన్సీ విలువ పతనం కూడా ప్రజలలో ఆగ్రహానికి దారితీస్తోంది. దీంతో పలు ప్రావిన్సుల్లో వీధుల్లోకి వచ్చి ఆందోళనలకు దిగుతున్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారు. పోలీసుల కార్లకు నిప్పు పెట్టారు. భద్రతా బలగాల కాల్పుల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయినట్లు, చాలామంది కూడా గాయపడినట్లుగా కథనాలు వస్తున్నాయి.

**రెండేళ్లుగా ఆర్థిక సంక్షోభం...**


ఇరాన్ కరెన్సీ రెండేళ్లుగా పతనం అవుతోంది. దీంతో ఆర్థిక సంక్షోభం తలెత్తుతోంది. దీనికి అడ్డుకట్ట ఎంతకూ లేదు. అందుకని ప్రజలు నిరసనలకు దిగుతున్నారు. అయితే, వీరిపై భద్రతా దళాలు గనుక కాల్పులు జరిపితే తాము జోక్యం చేసుకుంటాం అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ పౌరులను రక్షించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, ఈ ప్రకటనను ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ సీనియర్ సలహాదారు లార్జాని తప్పుబట్టారు. అమెరికా జోక్యం చేసుకుంటే ఈ ప్రాంతం అంతా ఘర్షణలు చెలరేగుతాయని హెచ్చరించారు.

**ముల్లాలు వెళ్లిపోవాలి**

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీకి వ్యతిరేకంగా ప్రజలు నిరసనలకు దిగుతూ.. ముల్లాలు వెళ్లిపోవాలి అని డిమాండ్ చేస్తున్నారు. గత ఆదివారం రాజధాని టెహ్రాన్ లో మొదలైన నిరసనలు దేశమంతా వ్యాపించాయి. చాలా నగరాలు, పట్టణాల్లో ప్రజలు భద్రతా దళాలతో ఘర్షణలకు దిగుతున్న వీడియోలు బయటకు వస్తున్నాయి. 2022లో అమిని మరణం తర్వాత ఇరాన్ లో జరుగుతున్న పెద్ద నిరసనలు ఇవేనని పరిశీలకులు చెబుతున్నారు.

## మోదీకి క్షమాపణ చెప్పాల్సిందే.. కూనంనేనిపై బండి సంజయ్ ఫైర్

హైదరాబాద్,ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలంగాణ సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు క్షమాపణ చెప్పాల్సిందేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ప్రధాని మోదీపై కూనంనేని చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.అసెంబ్లీ వేదికపై ఇలాంటి వ్యాఖ్యలకు ఏమాత్రం స్థానం లేదని అన్నారు. దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు భావజాలం ప్రజాదరణ కోల్పోవడానికి ఇలాంటి బాధ్యతలేని, అసభ్యకరమైన భాషే కారణమని విమర్శించారు.తెలంగాణ అసెంబ్లీలో అటువంటి వ్యాఖ్యలను స్పీకర్ అనుమతించడం బాధాకరమని బండి సంజయ్ అన్నారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, మిత్రపక్షాన్ని కాపాడుకునే ప్రయత్నంలో భాగంగానే ఈ వ్యవహారం చోటుచేసుకుందని ఆరోపించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు మాత్రం రాజకీయ దూషణలకే పరిమితమై ప్రజల



విశ్వాసాన్ని కోల్పోయాయని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కూనంనేని తన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకుని, దేశ ప్రజలకు అలాగే ప్రధాని నరేంద్ర మోదీకి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ నగరాన్ని కమ్మేసిన పొగమంచు..!

హైదరాబాద్ : హైదరాబాద్ నగరం కశ్మీర్‌ను తలపిస్తోంది. గత రెండు రోజుల నుంచి మంచు విపరీతంగా కురుస్తోంది. నగర శివార్లలో అయితే పొగమంచు దట్టంగా కురియడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.శనివారం ఉదయం కూడా హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో దట్టమైన పొగ మంచు కురిసింది. ఔటర్ రింగ్ రోడ్డు, ఇతర హైవేలపై ప్రయాణించేవారు జాగ్రత్తగా ఉండాలని అధికారుల సూచించారు. ప్రతి వాహనదారుడు నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు.అయితే హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చలి తగ్గినప్పటికీ.. పొగమంచు మాత్రం దట్టంగా కురుస్తుంది.



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్: 12 మంది మావోయిస్టులు మృతి



ఛత్తీస్‌గఢ్:ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలో జరిగిన కీలక ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి:

**ఎన్‌కౌంటర్ వివరాలు..**

సుక్మా జిల్లా అటవీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం ఉందన్న పక్కా సమాచారంతో భద్రతాబలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య భారీ ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. బలగాల కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.మృతుల్లో కీలక నేత, కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇది మావోయిస్టు వర్గాలకు పెద్ద లోటుగా భావిస్తున్నారు. ఘటనాస్థలంలో సోదాలు నిర్వహించిన భద్రతాబలగాలు భారీగా ఆయుధ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. వీటిలో: ఏకే-47 (AK-47) రైఫిల్స్, ఇన్సాస్ (INSAS) రైఫిల్స్, మరికొన్ని ఇతర మారణాయుధాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో భద్రతాబలగాల గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి.

## సంపాదకీయం

**ఆదివారం 04-01-2026**

# పాత కష్టాలు తొలగేనా?

కేంద్రం ఇటీవల ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవిక మిషన్–గ్రామీణ్(జీ రామ్ జీ) చట్టాన్ని తీసుకొచ్చింది. ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరు, చేసిన పనులకు సంబంధించి బోగస్ రికార్డులను సృష్టిస్తుండటం వల్ల పెద్దయెత్తున ప్రజాధనం పక్కదారి పడుతోందని పలు అధ్యయనాలు తేల్చాయి. మరి వీటిని సరిదిద్ది, నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చడానికి కొత్త చట్టం ఉపకరిస్తుందా? వికసిత్ భారత్ ఆవిష్కరణలో వారిని భాగస్వాములను చేస్తుందా?గ్రామాల్లోని కూలీలకు ఏటా వంద రోజులపాటు పనులు చూపించేందుకు 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(ఎంజీనరేగా) పథకాన్ని ప్రవేశపెట్టింది. కానీ, దీని అమలులో అనేక లోపాలు పొడచూపాయి. అసలు ఉనికిలో లేని కూలీలనూ... ఎక్కడో నగరాలు, పట్టణాల్లో ఉంటున్నవారిని సైతం ఉపాధి హామీ లబ్ధిదారులుగా చూపి డబ్బులు కాజేసినట్లు వెల్లడైంది. ఈ అక్రమాల్లో కొందరు అధికారుల పాత్ర వెలుగులోకి రావడం విస్మయం కలిగించింది. కూలీలకు చెల్లించిన వేతనాలను అసలుకన్నా చాలా ఎక్కువగా చూపడం, పనుల కోసం కొన్న సామగ్రి విలువను బాగా పెంచి రాయడం, బోగస్ సరఫరాదారులకు చెల్లింపులు జరపడం వంటి పద్ధతుల్లో అవినీతి జరిగినట్లు తెలియవచ్చింది. జవాబుదారీ కోసం సామాజిక ఆడిట్లు నిర్వహించినా, అవి జరగాల్సినంత విస్తృతంగా జరగలేదు. వాటిలో స్థానికుల భాగస్వామ్యం అంతంతమాత్రమే. పైగా ఉపాధి సొమ్ము స్వాహాదారులపై చర్య తీసుకోవడానికి స్థానిక అధికారులు మొరాయిస్తున్నారు. ఎంజీనరేగా కింద వేతనాల చెల్లింపులో విపరీతమైన జాప్యం జరుగుతుండటంతో నిజమైన పనివారిలో పలువురు ఈ పథకానికి దూరంగా ఉంటున్నారు. దాంతో దళారులు బోగస్ పనివారిని చూపి డబ్బులు స్వాహా చేసినట్లు అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి.

గ్రామీణ ఆర్థికానికి ఊతమివ్వాలని...

దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీల స్థాయిలో సాంకేతికంగా, పాలనాపరంగా సుశిక్షితులైన సిబ్బందికి తీవ్ర కొరత ఉంది. ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాల్సిన సిబ్బందికీ ఇటువంటి శిక్షణ లేదు. దాంతో పథకం అమలుకు పకడ్బందీ ప్రణాళికా రచన జరగలేదు. సమర్థ పర్యవేక్షణ కూడా కొరవడింది. ఇదంతా అవినీతిపరులకు అనువుగా మారింది. దీనికి తోడు నరేగా అమలు విపరీతంగా కేంద్రీకృతమైంది. గ్రామాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ అరకొరగా ఉండటం, హాజరు తీసుకోవడానికి ఉపయోగించే ఎన్ఎంఎంఎస్ యాప్ వంటి కీలకమైన అప్లికేషన్లలో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల నిజంగా అర్హులైన కార్మికుల పేర్లు జాబితా నుంచి అదృశ్యమవుతున్నాయి. స్థానిక పంచాయతీ అధ్యక్షులు, పెత్తందార్లు, దళారులతో అవినీతిపరులైన అధికారులు కుమ్మక్కవుతున్నారు. ఇది అవినీతికి ఎర్రతివాచీ పరుస్తోంది. పైగా, ఎంజీనరేగా చట్టం ద్వారా తమకు లభించే హక్కులు, సౌకర్యాల గురించి చాలామంది గ్రామీణులకు సరైన అవగాహన లేదు. దాంతో అవినీతిపరులు ఇష్టారాజ్యంగా ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తూ వచ్చారు. విస్తృతస్థాయిలో పాతుకుపోయిన ఈ అక్రమాలను అరికట్టి, లోపాలను సవరించి పకడ్బందీగా గ్రామీణ ఉపాధి కల్పించడానికి జీ రామ్ జీ–2025 చట్టాన్ని తీసుకొచ్చినట్లు కేంద్రం చెబుతోంది. గ్రామీణ ఉపాధి కల్పనా వ్యవస్థను ఆధునికీకరించి, సమర్థంగా అమలు చేయడంతో పాటు యావత్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకూ ఊతమివ్వాలన్నది కొత్త శాసన లక్ష్యమని పేర్కొంటోంది. ఉపాధి హామీ పథకం స్థానంలో తీసుకొచ్చిన 'జీ రామ్ జీ' ద్వారా ఏడాదిలో మొత్తం పనిదినాలను 150కి పెంచుతారు. ఎంజీనరేగా కింద గ్రామీణ కుటుంబాలు దరఖాస్తు పెట్టుకుంటేనే పనులు చూపించేవారు. 'జీ రామ్ జీ' పథకం మాత్రం అందుబాటులోని నిధులను ఉపయోగించుకుంటూ, అవసరమైన పనులకు గ్రామీణులను నియోగించాలని ఉద్దేశిస్తోంది. ఎంజీనరేగాకు కేంద్రమే పూర్తిగా నిధులిచ్చేది. 'జీ రామ్ జీ' కోసం రాష్ట్రాలు సైతం నిధులు కేటాయించాల్సి ఉంటుంది. దీనివల్ల రాష్ట్రాలపై ఆర్థికపరమైన బాధ్యతతో పాటు నిబద్ధత, జవాబుదారీతనం కూడా పెరుగుతాయి. గ్రామాల్లో రహదారుల నిర్మాణం, కాలువల తవ్వకం, ప్రభుత్వ భవనాల నిర్మాణం వంటి ప్రజా పనులను మాత్రమే కాకుండా... వ్యవసాయ కార్యకలాపాలు, గ్రామీణార్థికానికి ఊతమిచ్చే పనులను కూడా 'జీ రామ్ జీ' పథకం పరిధిలోకి తీసుకొస్తారు. దీని కింద సక్రమంగా చెల్లింపులు జరపడానికీ, జవాబుదారీతనాన్ని పెంచడానికీ డిజిటల్ సాంకేతికతను ఉపయోగిస్తారు. తద్వారా పారదర్శకత పెరుగుతుంది.

లోపాలను తక్షణమే సరిదిద్దాలి...

దిల్లీ, చండీగఢ్‌లు మినహా దేశవ్యాప్తంగా 741 జిల్లాల్లోని 2.69 లక్షల పంచాయతీల్లో 12.15 కోట్ల మందికి ఎంజీనరేగా ద్వారా లబ్ధి చేకూర్చినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి పార్లమెంటు స్థాయీ సంఘానికి వెల్లడించారు. ఎంజీనరేగా లబ్ధిదారుల్లో సగం మంది మహిళలు కాగా, 36శాతం మంది షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వారున్నట్లు కార్యదర్శి నివేదించారు. ఈ నేపథ్యంలో 'జీ రామ్ జీ' పథకంపై రాజకీయ పార్టీలు, గ్రామీణాభ్యుదయ విధాన నిపుణుల నుంచి రకరకాల వ్యాఖ్యలూ సలహాలూ వినవస్తున్నాయి. పనిదినాల పెంపు ద్వారా లబ్ధిదారులకు నిజంగా ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం జాగ్రత్త వహిస్తుందా అని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. సకాలంలో వేతనాలు చెల్లించడం, నిర్వహణాపరమైన లోపాలను సరిదిద్దడం వంటివి తక్షణం జరగకపోతే కొత్త పథకంతో ప్రయోజనాలు నామమాత్రమే అవుతాయని అవి హెచ్చరిస్తున్నాయి. ఎంజీనరేగా ద్వారా ఏడాదిలో వంద రోజుల పాటు పనిదినాలను చూపాల్సి ఉన్నా, చాలా రాష్ట్రాల్లో సగటున 50 రోజులతోనే సరిపెట్టినట్లు వివిధ అధ్యయనాలు తేల్చాయి. ఈ లోపాన్ని సరిదిద్దడానికి శ్రద్ధ వహించాలని రాష్ట్రాలను కోరినట్లు కేంద్రం రాజ్యసభకు తెలిపింది. 'జీ రామ్ జీ' చట్టానికి సంబంధించిన నియమ నిబంధనలను వచ్చే ఆరు నెలల్లో రూపొందించిన తరవాతే దాన్ని అమలు చేస్తారు. 'జీ రామ్ జీ' చట్టం గ్రామీణులకు నికరంగా మరిన్ని పనిదినాలు కల్పించడానికీ, పల్లెల్లో మౌలిక వసతులను విస్తరించడానికీ తోడ్పడుతుందని ప్రభుత్వం ఉద్ఘాటిస్తోంది. అదెంతవరకు నిజమవుతుందో చూడాలి!

# ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 64?




హైదరాబాద్, ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు మరో మూడు సంవత్సరాలు పెంచాలని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర?యం తీసుకున్నదని సచివాలయంలో జోరుగా ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంలో ప్రకటన చేయడమే తరువాయి ఉన్నతాధికారులు చెబుతున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీ లేదా ఆ తరువాత ఎప్పుడైనా నిర?యం వెలువడే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ప్రస్తుతం తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 61 సంవత్సరాలు. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. దీనిని 64 సంవత్సరాలకు పెంచనున్నారు.రాష్ట్రంలో ప్రభుత్వ విభాగంలో సుమారు 3,56,135 మందికి పైగా శాశ్వత ఉద్యోగులు వివిధ స్థాయిల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. రిటైర్ అయిన తరువాత ప్రభుత్వ ఉద్యోగులకు సర్వీసు పొడిగింపు ఉండబోదని 2025 జూన్ నెలలో జరిగిన మంత్రిమండలి సమావేశంలో నిర?యం తీసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత జరుగుతున్న ఈ ప్రచారానికి ఫుల్ స్టాప్ పడింది. అయితే తెర వెనుక మాత్రం మూడు సంవత్సరాల సర్వీసు పొడిగింపుపై ప్రతిపాదనలు సిద్ధం చేసి పెట్టారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తున్నది.ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు, డైలీ వేజ్, ఎన్ఎంఆర్, గౌరవ వేతనంతో సుమారు 4 లక్షల మంది వరకు రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్నారు. ఉద్యోగుల వివరాలను ఆధార్ తో అనుసంధానం చేసేందుకు మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆధ్వర్యంలో ఒక కమిటీ వేశారు. ఆ కమిటీ శాఖల వారీగా, విభాగాల అధిపతుల వారీగా విధులు నిర్వర్తిస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు, డైలీ వేజ్, గౌరవ వేతనంతో పనిచేస్తున్న వారి వివరాలు ఇంటిగ్రేటెడ్ ఫైనాన్సియల్ మేనేజిమెంట్ అండ్ ఇనార్మేషన్ సిస్టమ్ (ఐఎఫ్ఐఎంఎస్) వెబ్ పోర్టల్ ద్వారా కమిటీ సేకరించింది. గత నెల వరకు అందిన వివరాల ప్రకారం సుమారు 4 లక్షల మంది వరకు పనిచేస్తున్నట్లు తేలింది. ఇంకా ఆ లెక్కలను మదింపు చేసే పనిలో ఆర్థిక శాఖ ఉంది. అయితే చాలా మంది ఆధార్ కు అనుసంధానం చేయలేదని, ఈ ప్రక్రియ ఈ నెలలో పూర్తయ్యే అవకాశం ఉందంటున్నారు. ఆధార్ అనుసంధానం ద్వారా ప్రభుత్వ పథకాలు ఎవరు పొందుతున్నారు, వారి హోదా, వివరాలు కూడా ప్రభుత్వం సేకరించింది. 37వేల మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, సంక్షేమ పథకాలు, ఫుడ్ సెక్యూరిటీ కార్డులు తీసుకున్నట్లు వెల్లడి అయిందని వార్తలు వచ్చాయి. వీరిపై శాఖాపరంగా ఏ చర్యలు తీసుకోవాలనే దానిపై కూడా ప్రభుత్వం ఇంకా నిర?యం తీసుకోలేదని సమాచారం.ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అయిన తరువాత పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు ఉంటాయని ఆశించిన యువతకు నిరాశే ఎదురైంది. లక్షలాది ఉద్యోగాలు వస్తాయని, తమ బతుకులు బాగుపడతాయని ఊహించిన యువత తీవ్రంగా నష్టపోయింది. బీఆర్ఎస్ పాలనలో నియామకాలు చేపట్టకపోవడం మూలంగా ఒక జనరేషన్ పూర్తిగా ఉద్యోగ అవకాశాలను కోల్పోయింది. పదవీ విరమణ ప్రయోజనాలు వేల కోట్లు ఉండటంతో రిటైర్మెంట్ వయస్సును 61 ఏళ్లకు పెంపుదల చేసి, ఆ గండం నుంచి బీఆర్ఎస్ బయటపడింది. అలా సర్వీసు పొడిగింపు పొందిన వారు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రిటైర్ అవుతున్నారు. వీళ్లకు పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లించకుండా, బడా కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లిస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్థిక శాఖ వద్ద వేల కోట్ల పెండింగ్ బిల్లులు రిటైర్డు అయిన వారివి, సర్వీసులో ఉన్నవారివి కూడా ఉన్నాయి. ప్రతి నిత్యం వందల మంది రిటైర్డు ఉద్యోగులు బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయానికి వచ్చి రిక్త హస్తంతో వెనక్కి వెళ్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తారని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తారని ఊహించిన వారికి మొండి చెయ్యి ఇచ్చింది. ఆర్థికంగా నిధులు సర్దుబాటు కాకపోవడం, వచ్చిన డబ్బులను కాంట్రాక్టర్లకు మళ్లించడం మూలంగా మిగతా చెల్లింపులకు సమస్యలు వస్తున్నాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. ఈ గండం నుంచి గట్టెక్కేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 61 నుంచి 64 కు పెంచాలని నిర?యించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నిర్ణయంఈ ఏడాది జూన్ 2వ తేదీ లేదా ఆ తరువాత ఎప్పుడు అయినా ప్రకటన వెలువరిస్తుందని ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది.జూన్ నాటికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయి రెండున్నర సంవత్సరాలు అవుతుంది, మూడు సంవత్సరాల పొడిగింపు మూలంగా ఆ భారం వచ్చే సర్కార్ పై ఉంటుందనే ముందు చూపులో భాగంగా ఈ నిర?యం అంటున్నారు. అప్పుడు కూడా కాంగ్రెస్ వస్తే సరి లేదంటే వచ్చే సర్కార్ కు పదవీ విరమణ ప్రయోజనాలు గుదిబండగా మారనున్నాయి. రిటైర్మెంట్ అయిన వారి పెండింగ్ బిల్లులు రూ.10వేల కోట్ల వరకు ఉన్నట్లు ఒక అంచనా.

కేసీఆర్ సర్కార్ రిటైర్మెంట్ వయస్సు పెంపు

ఉద్యోగుల పదవీ విరమణ మొత్తం వేల కోట్ల రూపాయలు ఉండడం, కాళేశ్వరం ప్రాజెక్టు కు చెల్లింపులు ఉండడంతో అప్రమత్తమైన కేసీఆర్ సర్కార్ రిటైర్మెంట్ పై కీలక నిర?యం తీసుకున్నది. 2021 మార్చి నెలలో ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో రిటైర్ అయ్యే వారి సంఖ్య గణనీయంగా పడిపోయింది. రిటైర్ అయ్యే వారికి సకాలంలో చెల్లించకపోవడం, ఆ బకాయిల గుట్ట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ పై పడింది.

టీజీపీఎస్సీ నోటిఫికేషన్లు అనుమానమే

ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 61 నుంచి 64 ఏళ్లకు పెంచే నిర్ణయంతో టీజీపీఎస్సీ ఉద్యోగ నిమామకాలు ఉండకపోవచ్చని, జాబ్ క్యాలెండర్ కూడా అనుమానమేనన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. ఉద్యోగ విరమణలతో ఖాళీలు ఏర్పడుతాయని, కానప్పుడు కొత్త ఉద్యోగాలు ఎలా వస్తాయని సచివాలయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోయే వరకు ఎలాంటి కొత్త నియామకాలు ఉండవనేది స్పష్టమవుతున్నది.

# నాగర్‌కర్నూల్ కాంగ్రెస్‌లో గుబులు.. పంచాయతీ ఎన్నికల్లో ఏం జరిగింది?




నాగర్‌కర్నూల్: అంతా వన్ సైడ్ అనుకున్న నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సీన్ రివర్స్ అయ్యిందటా.. రెండేళ్ల పాలన దిగ్విజయంగా పూర్తి చేసుకుంటూ, ఇద్దరు ప్రజాప్రతినిధులు ఉండటంతో పంచాయతీల్లో మెజార్టీ స్థానాలు తమకే తథ్యం అనుకున్న కాంగ్రెస్ శ్రేణుల ఆశలకు గండి పడిందంట .. అధికారంలో ఉండి కూడా సర్పంచ్ అభ్యర్థి దొరకపోవడం, ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి సర్పంచ్‌గా ఏకగ్రీవం కావడం చర్చనీయాంశంగా మారిందిక్కడ.. ఇద్దరు ప్రజాప్రతినిధుల ఆశలకు రెబల్ అభ్యర్థులుగా బరిలో నిలిచిన వారు వెన్నుపోటు పొడవడంతో రిజల్ట్ తలకిందులైందంట.. అసలు నాగర్‌కర్నూల్ పంచాయతీ ఎన్నికల్లో ఏం జరిగింది?

కాంగ్రెస్‌కు డేంజర్ బెల్ మోగించిన సర్పంచ్ ఎన్నికల ఫలితాలు

నాగర్ కర్నూల్ జిల్లా నాగర్ కర్నూల్ సెగ్మెంట్లో స్థానిక సంస్థల ఎన్నికలలో మొదటి, 2వ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్ పార్టీకి డేంజర్ బెల్ మోగించాయి.. నాగర్ కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుండి ఎమ్మెల్సీగా కుచుకుళ్ళ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే గా డాక్టర్ కుచుకుళ్ళ రాజేష్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.. గతంలో బీఆర్ఎష్ అభ్యర్థిగా రెండు సార్లు ఎమ్మెల్యేగా పని చేసిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఆయన బీఆర్ఎస్లో కొనసాగే విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. ఆయన పార్టీ మారే విషయమై ఆలోచనలో పడ్డారంట.

సర్పంచ్ ఎన్నికల్లో ఎలాంటి ఎదుగు, బొదుగు లేని కాంగ్రెస్

ఒకవైపు కాంగ్రెస్ అధికారంలో ఉండి నాగర్‌కర్నూల్ సెగ్మెంట్లో ఆ పార్టీకి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఉండి ప్రభుత్వ పథకాల గురించి ఊదరగొడుతున్నా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పోలిస్తే సర్పంచి ఎన్నికల ఫలితాలలో ఎలాంటి ఎదుగుదల లేకుండా గొర్రెతోక బెత్తడే అన్న చందంగా ఉండిపోవడం చర్చనీయాంశంగా మారింది.. నియోజకవర్గం నుంచి గ్రామ స్థాయి వరకు , లీడర్ నుండి కేడర్ వరకు కకావికలమవుతున్నా గులాబీ పార్టీకి గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ తగ్గకపోవడం కాంగ్రెస్ శ్రేణులను కలవరపరుస్తోందంట.

అధికార పార్టీకి దొరకని సర్పంచ్ అభ్యర్థులు

నాగర్ కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గంలో నాగర్ కర్నూల్, బిజినాపల్లి ,తిమ్మాజిపేట, తాడూరు, తెలకపల్లి మండలాలున్నాయి. అందులో 131 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు 71 మంది గెలుపొందగా బీఆర్ఎస్ హాఫ్ సెంచరీ కొట్టి అధికార పార్టీకి సవాల్ విసిరింది.. తాడూరు మండలం ఎట్టిదర్‌పల్లి గ్రామ సర్పంచ్‌గా బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి కవిత అర్జున్, బిజినపల్లి మండలం రాంరెడ్డిపల్లి తండా సర్పంచ్‌గా ఆ పార్టీ అభ్యర్థి పట్లవత్ సాలి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. ఆ పంచాయతీల్లో అధికార పార్టీకి సర్పంచ్ అభ్యర్థి దొరకపోవడం హాట్ టాపిక్‌గా మారింది.

ఎమ్మెల్యే స్వగ్రామంలో అతికష్టం మీద గెలిచిన కాంగ్రెస్

ఇక సెగ్మెంట్లో బీజేపీ మూడు స్థానాల్లో , సిపిఐ ఒక స్థానంలో గెలుపొందగా స్వతంత్రులు ఆరుగురు గెలుపొందారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి స్వగ్రామం తిమ్మాజిపేట మండలం నేరేళ్లపల్లి గ్రామంలో సర్పంచ్ స్థానం మీసాల లక్ష్మి సహావార్డ్ మెంబర్ల దాకా క్లీన్ స్వీట్ చేసింది. ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి స్వగ్రామం నాగర్ కర్నూల్ మండలం తుడుకుర్తిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లక్ష్మమ్మ కరా?కర్ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థిపై అతి కష్టం మీద గట్టెక్కారు. మొత్తం మీద బీఆర్ఎస్‌కి గ్రామీణ స్థాయి ప్రజల్లో ఆదరణ తగ్గలేదన్నది కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి మరింత చొచ్చుకు పోవాల్సిన అవసరం ఉందన్న విషయం ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి..

నియోజకాభివృద్ధికి రూ. 1000 కోట్లు తెచ్చిన ఎమ్మెల్యే

రెండేళ్ల పాటు నియోజకవర్గ అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే కూచుకుల రాజేష్ రెడ్డి 1000 కోట్ల పైచిలుకు నిధులు అభివృద్ధి కోసం తీసుకొచ్చారు. వాటికి సంబంధించిన కార్యక్రమాలు కొన్ని కొనసాగుతున్నా కొన్నిటికి నేటికి టెంకాయ కొట్టకపోవడం విశేషం.. అదే %ఎ% రోడ్ల విషయంపై సర్పంచ్ ఎన్నికల్లో తాడూరు మండలం ఐతోలు గ్రామంలోని కోమటి తండాలో ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేని గ్రామస్థులు అడ్డుకున్నారంట.. అభివృద్ధి పథంలో నడిపేందుకు తీసుకొచ్చిన నిధులు మంజూరు విషయం పట్టణ స్థాయి నుండి గ్రామీణ స్థాయి వరకు ప్రజలకు చేరవేయడంలో ప్రధాన భూమిక పోషించే పార్టీ సోషల్ మీడియా ఆక్టివ్ గా లేదంట.మొత్తమ్మీద చేస్తున్న అభివృద్ధిపై నాయకులు ప్రచారం చేసుకోకపోవడం వల్లే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి పలుచోట్ల ఎదురుదెబ్బ తగిలిందంటున్నారు. దీనికి తోడు పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా ఒక్కరినే పోటీలో పెట్టే విషయంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి వైఫల్యం చెందారన్న టాక్ వినిపిస్తుంది ఒక గ్రామపంచాయతీలో అధికార పార్టీ నుండి ముగ్గురు వరకు పోటీలో దిగడం, అభివృద్ధిని ప్రజలకు చేరవేసే విషయంలో ఫెయిల్ కావడం వల్లే ఈ ఎన్నికల రిజల్ట్ రివర్స్ అయిందంటున్నారు

మున్సిపల్ , ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై క్యాడర్లో గుబులు

నియోజకవర్గంలో ఇప్పటికైన జరుగుతున్న అభివృద్ధిని ప్రజలలోకి తీసుకెళ్లాలని లేకపోతే రానున్న మున్సిపల్ , ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై దాని ప్రభావం పడుతుందని క్యాడర్ వాపోతోంది. చ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు పరిస్థితి ఇలాగే కొనసాగితే అధికార పార్టీకి నాగర్‌కర్నూల్‌లో గడ్డు కాలం తప్పదంటున్నారు.

## ప్రజల సహకారంతోనే అవినీతి నిర్మూలన

హన్మకొండ,నూతన సంవత్సర వేడుకలను హనుమకొండ కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఒకరికొకరూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం అవినీతి నిర్మూలన కోసం జ్వాలా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన వినూత్న కార్యక్రమంలో అధికారులు పాలుపంచుకున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రభుత్వాధికారులతో అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. హన్మకొండ కలెక్టరేట్‌లో అవినీతికి వ్యతిరేకంగా ప్రభుత్వాధికారుల సంతకాలు సేకరించారు. అవినీతికి వ్యతిరేకంగా హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీశ్ తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహశబరీశ్ మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ అధికారులకు ప్రభుత్వం సరిపడా వేతనం ఇస్తోందని తెలిపారు. అధికారులు మంచి జీతంతో జీవితం గడపాలని సూచించారు. అవినీతిని ప్రోత్సహించొద్దని కలెక్టర్ స్నేహ శబరీశ్ కోరారు.

## రాహుల్ తరచూ విమర్శలపై బిజెపి ఫైర్

బెంగళూరు, ఇవిఎంలపై దుమారం రేపుతున్న కాంగ్రెస్‌కు అశనిపాతం లాంటి అనుభవంఎదురయ్యింది. అది కూడా తమ పార్టీ అధికారంలో ఉన్న కర్నాటక నుంచే రావడం విశేషం. ఎన్నికల పక్రియలో విశ్వసనీయత, ఈవీఎంల పనితీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తరచూ విమర్శలు వ్యక్తం చేస్తోన్న వేళ.. కర్ణాటకలో చేపట్టిన ఓ ప్రభుత్వ సర్వే ఫలితాలు చర్చనీయాంశంగా మారాయి. ఆ సర్వేలో రాష్ట్రంలోని మెజార్టీ ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్‌లను విశ్వసిస్తున్నట్లు తేలింది. దీంతో రాహుల్ గాంధీపై భాజపా విమర్శలు గుప్పించింది. ఇవిఎంలను తప్పు పట్టడం ద్వారా రాహుల్ రాజకీయం బయటపడిందని విమర్శలకు పదను పెట్టింది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలపై కర్ణాటక ప్రభుత్వ ఏజెన్సీ కేఎంఈఏ కర్ణాటక మానిటరింగ్ అండ్ ఎవల్యూషన్ అథారిటీ గతేడాది ఆగస్టులో సర్వే నిర్వహించింది. ఆ రిపోర్ట్‌ను తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం..ఈవీఎంలు విశ్వసించదగినవేనని 83.61శాతం మంది వెల్లడించినట్లు తేలింది. ఇక, ఈ యంత్రాలు కచ్చితమైన ఫలితాలను ఇస్తాయని 69.39 శాతం మంది అంగీకరించినట్లు నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగాయని 91.31 శాతం విశ్వసించినట్లు సర్వే పేర్కొంది. ఈ సర్వేలో 102 అసెంబ్లీ నియోజవర్గాలకు చెందిన దాదాపు 5,100 మంది పాల్గొన్నారు. బెంగళూరు, బెళగావి, కలబురగి, మైసూరు డివిజన్లలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలను సర్వే చేసి ఈ నివేదిక రూపొందించారు. ఈ సర్వే ఫలితాలపై కర్ణాటక ప్రతిపక్ష నేత, భాజపా నాయకుడు ఆర్.అశోక్ స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, ఈవీఎంలు నమ్మదగినవి కావని గత కొన్నేళ్లుగా రాహుల్ గాంధీ ఒకే పాట పాడుతున్నారు. మన సంస్థలను ఆయన విశ్వసించడం లేదు. కానీ, ఆయన మాట తప్పని కర్ణాటక రుజువు చేసింది. ఎన్నికలను, ఈవీఎంలను, మన ప్రజాస్వామ్య పక్రియను ప్రజలు నమ్ముతున్నారు. ఈ సర్వే కాంగ్రెస్‌కు చెంపపెట్టు. ప్రజాభిప్రాయం ఎలా ఉందో తెలిసినా.. సిద్ధరామయ్య ప్రభుత్వం మాత్రం స్థానిక ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తామని ప్రకటించడం హాస్యాస్పదం అన్నారు.

## శబరిమల బంగారం చోరీ వ్యవహారం

తిరువనంతపురం, శబరిమల ఆలయ పునరుద్ధరణ పనుల్లో చోరీకి గురైన బంగారంలో ఇప్పటివరకు దొరికినదానికంటే ఇంకా ఎక్కువే పోయి ఉంటుందని ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ అనుమానిస్తోంది. ఇప్పటి వరకుఎ రికవరీ జరిగిన సొత్తు విలును అంచనా వేస్తున్నారు. ఇంకా ఎక్కడెక్కడ ఉందా అని ఆరా తీస్తున్నారు. ముగ్గురు నిందితుల్ని తమ కస్టడీకి అప్పగించాల్సిందిగా కోరుతూ కొల్లం విజిలెన్స్ కోర్టుకు సమర్పించిన దరఖాస్తులో సిట్ ఈ అనుమానం వ్యక్తం చేసింది. 2019లో బంగారం పూత పూసిన రాగి రేకులను ఎలక్ట్రో ప్లేటింగ్ కోసం స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు అప్పగించారని సిట్ తన పిటిషన్‌లో పేర్కొంది. ఆ ప్లేట్ల మొత్తం బరువు 42.100 కేజీలు కాగా ఎలక్ట్రోప్లేటింగ్ పక్రియ పూర్తైన తర్వాత మిగిలిన బంగారాన్ని నిందితులు మింగేశారని అభియోగం. ద్వారపాలక విగ్రహాల నుంచి, వాటికి సమీపంలోని రెండు స్తంభాల నుంచి బంగారం పూసిన రేకుల్ని తొలగించారని, గర్భగుడి ద్వారం నుంచి ఇలాంటి ఏడు రేకులు తొలగించి వాటికి బంగారు పూత తిరిగి పూశారని సిట్ కోర్టుకు తెలిపింది. గర్భగుడి నుంచి తొలగించిన ప్లేట్లలో రెండింటిపై విష్ణుమూర్తి దశావతారాలు చెక్కి ఉన్నాయని వివరించింది. ఎలక్ట్రోప్లేటింగ్ అనంతరం ఉన్నికృష్ణన్ పొట్టి తనకు 474.90 గ్రాముల బంగారం ఇచ్చాడని గోవర్ధన్ అనే మరో నిందితుడు తెలియజేసి ఆమేరకు సిట్‌కు బంగారం అప్పగించాడు. ద్వారపాలక విగ్రహాలపై ఉన్న బంగారు పూసిన రాగి ప్లేట్లపై వాస్తవానికి ఇంకా ఎక్కువ పరిమాణంలో బంగారం ఉందని సిట్ వెల్లడించింది. ఈ కేసులో బంగారాన్ని దొంగిలించిన వ్యక్తి, కొన్న వ్యక్తి కూడా కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీని ఎలా కలవగలిగారని ముఖ్యమంతి పినరయి విజయన్ ప్రశ్నించారు. ఈ కేసు దర్యాప్తు కేరళ హైకోర్టు పర్యవేక్షణలో జరుగుతోందని, కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నట్లు తన కార్యాలయ జోక్యమేమీ లేదని స్పష్టంచేశారు. సిట్ దర్యాప్తుపై ఇంతవరకు ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు.

## తాడిపత్రి బాగుకోసమ దీక్ష చేసా

అనంతపురం, తాడిపత్రి బాగుకోసమే దీక్ష చేస్తున్నానని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ సర్కిల్‌లో ఉన్న గాంధీ విగ్రహం ఎదురుగా గురువారం ఆయన దీక్ష చేయడం జిల్లాలో సంచలనం రేకెత్తించింది. మున్సిపాలిటీ ఆస్తులను ప్రజలకు తెలపాలనే ఉద్దేశంతోనే దీక్ష చేపట్టానన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దీక్ష చేసినట్లు ఆయన తెలిపారు. తాడిపత్రి మున్సిపాలిటీకి వస్తున్న ఆదాయం ఎంత ఖర్చు ఎంత అన్న విషయం ప్రజలకు తెలపాలని ఫ్లెక్సీని ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ ఎక్కడా లేదని చెత్తను గార్బేజీ వాహనాల్లోనే వేస్తున్నారన్నారు. 2026 సంవత్సరం చివరికల్లా తాడిపత్రిని నంబర్–1 మున్సిపాలిటీగా చేస్తానన్నారు. భూగర్భనీటి వ్యవస్థ ద్వారా వచ్చిన నీటిని శుద్ధిచేసి సమీపంలోని అర్జాస్ స్టీల్‌ఎ÷–లాంట్‌కు సరఫరా చేసి ఆదాయం సమకూర్చుతున్నామన్నారు. తాడిపత్రి మున్సిపాలిటీకి 270ఎకరాలు ఆస్తి ఉందని వాటివిలువ దాదాపు రూ.2వేల కోట్లు అన్నారు.

## ఈకేవైసీ నమోదు చేసుకోని 77వేలమంది

కాకినాడ, రేషన్ కార్డుల్లో పేర్లు ఉన్నా..కొందరు మాత్రం ఎక్కడున్నారో తెలియడం లేదు. అయినా వారిపేరు మీద నెలనెలా రేషన్ సరఫరా జరిగిపోతోంది. ప్రభుత్వం కిలో బియ్యానికి రూ.46 వెచ్చిస్తోంది. ఈ లెక్కన జిల్లాలో ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న సభ్యులకు ప్రతినెలా రూ.1.64కోట్ల విలువైన బియ్యం సరఫరా చేస్తున్నారు. ఏడాదికి ఈ లెక్క రూ.20 కోట్లకు చేరుతోంది. కాకినాడ జిల్లాలో కార్డుదారులకు ప్రతినెలా 9,300 టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. వీరిలో ఈకేవైసీ చేసుకోని 77వేల మందికి 385 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇదంతా పక్కదారి పట్టినట్లే.. ఇలా ఏడాదికి 4,620 టన్నుల బియ్యం అక్రమార్కుల పాలవుతోందని గుర్తిచారు. రేషన్‌కార్డుదారులు శాశ్వతంగా ఇతర రాష్ట్రాలకు వలసవెళ్లినా, కుటుంబ సభ్యులు మరణించినా, ఇతర దేశాలకు వెళ్లిన వారికి యథావిధిగా ప్రభుత్వం ప్రతినెలా రేషన్ బియ్యం విడుదల చేస్తోంది. ఈ విధానంతో పెద్ద ఎత్తున సరకు పక్కదారి పడుతోందని, దీని అడ్డుకట్టకు కార్డులోని ప్రతి సభ్యుడు విధిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని కేంద్రం ఆదేశించింది. గత కొన్ని నెలలుగా జిల్లాలో ఈ పక్రియను ప్రారంభించారు. ఇప్పటికీ 77 వేల మంది ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. వీరు ఎక్కడున్నారనే వివరాలు తెలియడం లేదు. అయినా కార్డులోని అందరికీ ప్రతీనెలా రేషన్ పంపిణీ మాత్రం జరుగుతోంది.రేషన్‌కార్డుల్లోని సభ్యుల ఈకేవైసీకి 2025, నవంబరు 30 వరకు గడువు ఇచ్చారు. అందరూ డీలరు, గ్రామ,వార్డు సచివాలయాల్లో తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకో వాలని సూచించారు. గడువులోగా ఈ పక్రియ పూర్తి చేసుకోకపోతే కార్డుల్లో వారి పేర్లు తొలగిస్తామని ప్రభుత్వం ఆదేశించింది. అయినా వీరంతా ఇప్పటి వరకు పట్టించుకోలేదు.

# సీఎం రేవంత్ తీరు దారుణం

హైదరాబాద్,అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మండిపడ్డారు. నదీజలాలపై పీపీటీలో పాయింట్ లేదని విమర్శించారు. అందులో అధికార బలం, అహంకారం తప్ప ఏమీ లేదని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి తీరుపై విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి బైపోలార్ డిజార్డర్‌తో బాధపడుతున్నాడని ఎమ్మెల్యే సంజయ్ విమర్శించారు. ఒక్కటే ప్రెస్‌మీట్‌లో ఒకసారి అసెంబ్లీకి రావాలి అంటాడు, వెంటనే ఉరి తీయాలి అంటాడని మండిపడ్డారు. అసెంబ్లీకి వస్తే గౌరవం ఇస్తానని అంటున్నాడు.. అంటే రేవంత్ రెడ్డి ఇప్పటివరకు అగౌరవంగానే ప్రవర్తించాడని అర్థం కదా అని ప్రశ్నించారు. కసబ్ లెక్క ఎవరిని ఉరితీస్తారో ప్రజలే నిర్ణయిస్తారని తెలిపారు. రేవంత్ రెడ్డి మూర్ఖపు మాటలకు ప్రజలు ఈసారి ఆయనను కసబ్ లాగా ఉరి తీస్తారని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకులకు గౌరవం ఉంటుందని అన్నారు. అసెంబ్లీ రూల్స్ మొత్తం ఈయనే రూల్ చేసినట్లు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. పాలమూరు బిడ్డగా పాలమూరును కాపాడుకునే అవకాశం వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డికి తెలిపారు. ఇప్పటికైనా ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేసీఆర్ వచ్చి సలహాలు ఇవ్వాలని రేవంత్ రెడ్డి అంటున్నాడని.. మరి జూరాల ప్రాజెక్టు కింద క్రాప్ హాలీడే ప్రకటించింది మీ ప్రభుత్వమే కదా అని ప్రశ్నించారు. కేఎల్ఐలో ఇప్పటికీ పుష్కలంగా నీళ్లు ఉన్నాయని తెలిపారు. కానీ ఆదిత్యనాథ్ దాస్ సలహాతో జూరాల నుంచి లిఫ్ట్ చేయాలని అంటున్నాడని పేర్కొన్నారు. దయచేసి ఇప్పటికైనా మంచి సలహాదారుడిని పెట్టుకోవాలని సూచించారు. ఆంధ్రా అడ్వైజర్‌ను తీసేసి తెలంగాణ అడ్వైజర్‌ను పెట్టుకోవాలని అన్నారు. నీళ్లకు సంబంధించి పక్క రాష్ట్రంతో మనకు ఉన్న సమస్యలు పరిష్కారం కావాలంటే తెలంగాణ సోయి ఉన్నోడు అడ్వైజర్‌గా ఉండాలని స్పష్టం చేశారు. నికర జలాలు ఉండగా, వరద జలాల నుంచి లిఫ్ట్ ఎలా చేస్తారని ఎమ్మెల్యే సంజయ్ ప్రశ్నించారు. ఇప్పటికే ఒక మోటార్ ద్వారా వాటర్ లిఫ్ట్ చేశామని గుర్తుచేశారు. ఇవాళ, రేపు పాలమూరు ? రంగారెడ్డి ప్రాజెక్టుపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఇరిగేషన్ గురించి అర్థం కావడం లేదని ఎమ్మెల్యే సంజయ్ ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా బాగా ప్రిపేర్ అయ్యి సభకు రావాలని సూచించారు.

# తేలనున్న ఆ నేతల భవితవ్యం!

అమరావతి,ఏపీలో మహిళా నేతలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుంది.. అన్ని పార్టీల్లోనూ వారికంటూ ఒక ఇమేజ్ ఉంటుంది. అలా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఇమేజ్ దక్కించుకున్నారు రోజా, విడదల రజిని. రోజా అయితే దశాబ్ద కాలం ఎమ్మెల్యే అయ్యేందుకు వేచి చూశారు. తెలుగుదేశం పార్టీలో వర్కౌట్ కాకపోయేసరికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి తన ఎమ్మెల్యే కలను సాకారం చేసుకున్నారు. ఏకంగా మంత్రి అయ్యారు కూడా. విడదల రజిని అయితే తొలి ప్రయత్నం లోనే ఎమ్మెల్యే అయిపోయారు. తెలుగుదేశం పార్టీలో ద్వితీయ శ్రేణి నేతగా ఎంట్రీ ఇచ్చి.. వైసీపీలో చేరి ఎమ్మెల్యేగా, ఆపై మంత్రిగా తన మార్కు చూపించుకున్నారు. అయితే ఇప్పుడు ఆ ఇద్దరూ మహిళ నేతలు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సైతం మునుపటి మాదిరిగా యాక్టివ్ గా లేకపోతున్నారు.

నగిరి కి ప్రత్యామ్నాయ నేత..

రాజకీయాలు అన్నాక పరిస్థితులు ఎప్పుడు ఒకేలా ఉండవు. ఇక్కడ రకరకాల సమీకరణలు పనిచేస్తాయి. అందుకు అనుగుణంగా నిర?యాలు ఉంటాయి. రోజా విషయంలో ఈసారి నగిరి టిక్కెట్ ఇచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. అక్కడ ఇన్ని రోజులు రాజకీయం చేసిన రోజా మిగతా వారిని కలుపు కెల్లలేకపోతున్నారు. రాజకీయ ప్రత్యర్థుల మాదిరిగానే సొంత పార్టీ నేతల విషయంలో కూడా ఆమె వ్యవహరిస్తున్నారు అలానే. 2014, 2019 ఎన్నికల్లో ఆమె తక్కువ ఓట్లతోనే గెలిచారు. 2024 ఎన్నికలకు వచ్చేసరికి ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇప్పటికీ సొంత పార్టీ నేతలతో సఖ్యత ఏర్పరుచుకోలేదు. పైగా చిత్తూరు జిల్లాలో సీనియర్ మాజీ మంత్రి తో వైరం పెంచుకుంటున్నారు. అయితే ఇప్పుడు పార్టీని బాగు చేసే పనిలో ఉన్నారు జగన్. అందుకే రోజాను తప్పించి మరో నేతను ఇంచార్జిగా ప్రకటిస్తారని తెలుస్తోంది. పార్టీ అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవి ఇస్తానని రోజాకు జగన్ తేల్చి చెప్పినట్లు సమాచారం. అందుకు ఆమె అంగీకరిస్తే పర్వాలేదు. లేకుంటే బయటకు వెళ్లిపోయిన పర్వాలేదు అన్న రీతిలో జగన్మోహన్ రెడ్డి ఉన్నట్లు తెలుస్తోంది.

రేపల్లె వెళ్లాలని..

మాజీ మంత్రి విడదల రజనీవిషయంలో కూడా జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక ఆలోచన చేస్తున్నారు. చిలకలూరిపేట నుంచి గెలిచిన ఆమెను గత ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి షిఫ్ట్ చేశారు. అక్కడ వర్కౌట్ కాకపోవడంతో ఆమె తిరిగి చిలకలూరిపేట వచ్చేసారు. ఇక ఆ నియోజకవర్గం తనదేనన్న నిర?యానికి వచ్చారు. మర్రి రాజశేఖర్ లాంటి నేతలు పార్టీ నుంచి బయటకు వెళ్లిపోవడంతో.. ఇక తనకు తిరుగు లేదన్న భావనకు వచ్చారు. అయితే ఆమెను రేపల్లె పంపించి మంత్రి అనగానే సత్యప్రసాద్ ను ఓడించాలని చూస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అందుకు ఒప్పుకోవడం లేదు రజని. అవసరం అయితే పోటీ చేయకుండా ఉండిపోతానని.. రేపల్లె నుంచి మాత్రం పోటీ చేయనని తేల్చి చెబుతున్నారు. చేస్తే రేపల్లె నుంచి.. లేకుంటే పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయిన పర్వాలేదని సంకేతాలు అధినేత నుంచి వస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. అయితే ఈ కొత్త సంవత్సరంలో ఈ ఇద్దరు మహిళా నేతల భవితవ్యం తేలనుంది. మరి అధినేత ఎలాంటి నిర?యాలు తీసుకుంటారో.. ఈ మహిళ నేతలు ఎలాంటి అడుగులు వేస్తారో చూడాలి.

# సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సిద్దిపేట, పెండింగ్‌లో ఉన్న సర్పంచుల బిల్లులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కొత్త సర్పంచులకు నిధులను కేటాయించాలని విన్నవించారు. గురువారం అక్బర్‌పేట, భూంపల్లి మండలంలోని బొప్పాపూర్‌లో ఎంపీ రఘునందన్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఓపెన్ జిమ్, బాలవికాస వాటర్ ఎ÷–లాంట్, సోలార్ స్ట్రీట్ లైట్లను సర్పంచ్ మాధవనేని భాను ప్రసాద్, పాలకవర్గంతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంపీ రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు. మహాత్మాగాంధీ కళలు కన్నా గ్రామస్వరాజ్యం సాధించాలని పాలకవర్గానికి సూచించారు. తన పార్లమెంట్ పరిధిలో ఎప్పుడు, ఏ సమస్య వచ్చిన 24 గంటలు తాను అందుబాటులో ఉండి పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. వ్యక్తిగత రీత్యా కూడా గ్రామపంచాయతీల ఏర్పాటుకు కృషి చేస్తానని మాటిచ్చారు. బొప్పాపూర్ గ్రామ పంచాయతీ, ఐకేపీ సెంటర్లో లైట్లు, రోడ్ల నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటిపై సోలార్‌ను ఏర్పాటు చేసుకుని కరెంట్ ఆదా చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు ఎంపీ రఘునందన్ రావు.మూడున్నరేళ్లలో సోలార్ నుంచి కరెంట్ తయారీ చేసేలా చూడాలని నిర్దేశిరచారు. ఎనగుర్తి నుంచి శిలాజీ నగర్ వరకు డబుల్ రోడ్డు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద 'మన ఊరు – మన బడి' నిధుల్లేవని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో సర్పంచులు పనిచేసిన బిల్లులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# ట్రంప్ అడుగుజాడల్లో చైనా




వాషింగ్టన్:మంచేదైనా జరిగితే తమ ఖాతాలో వేసుకోవటానికి సిద్ధపడేవాళ్లు కోకొల్లలు. ఇది లోకో త్తర సత్యం. ఒకరకంగా అదొక వ్యాధి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఆ సమస్య ఉంది. తన ప్రమేయం లేకుండా ముగిసిన యుద్ధాలనూ, ఇంకా ముగియని యుద్ధాలనూ తానే ఆపానని చెప్పుకోవడం తోపాటు ఉనికిలో లేనివాటికి కూడా అడ్డుచక్రం వేశాననటం ఆయనకే చెల్లింది. ఆ బాణీ ఇంకా ఆపలేదు. ఇప్పుడు చైనా వంతు వచ్చినట్టుంది. 2025లో భారత్‌పాక్ ఘర్షణలు నివారించటంతోపాటు అనేక ఇతర యుద్ధాలను ఆపిన ఘనత తమదంటూ తాజాగా వాంగ్‌యీ ప్రకటించుకున్నారు. ఆ రెండు దేశాలూ అనేక రంగాల్లో పోటీపడుతున్నాయి. ఆర్థికంగా ఇప్పటికీ అమెరికాదే పైచేయి అయినా, రేపో మాపో దాన్ని చైనా అధిగమిస్తుందని ఎవరో కాదు... ఆర్థిక నిపుణులే దండోరా వేస్తు న్నారు. ఆ విషయంలో చైనాను ప్రశంసించాల్సిందే! అమెరికాతో పోలిస్తే ఎక్కడో అట్ట డుగునుండే దేశాన్ని 75 ఏళ్లలోనే ఈ స్థాయికి తీసుకురావటం మాటలు కాదు మరి. అంతమాత్రాన అమెరికా చెప్పే అబద్ధాలను కూడా వల్లెవేయటం వంటి చౌకబారు అనుకరణలు బెడిసికొడతాయని చైనా గ్రహించకపోవటం క్షమార్హం కానిది. ˇశ్మీర్‌లోని పెహల్గాంలో పాక్ నుంచి చొరబడిన ఉగ్రవాదులు అనేకమంది అమాయ కులను పొట్టనబెట్టుకున్న వైనం తర్వాత గత ఏడాది మే మొదటివారంలో మన దేశం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో అక్కడి ఉగ్ర స్థావరాలపై దాడులు చేయటం, దానికి ప్రతిగా పాకిస్తాన్ సైన్యం మనపై దాడి చేసే ప్రయత్నం, మనం తిప్పికొట్టడం, ఎదురు దాడి చేయడం వంటివి జరిగాయి. చివరకు కుదిరిన కాల్పుల విరమణ వెనక రెండు దేశాల మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరళ్లు (డీజీఎంలు) ఉన్నారని మన దేశం చెబుతోంది. ఇలాంటి విషయాల్లో మూడో పక్షం జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించ బోమని అప్పట్లోనే స్పష్టం చేసింది. నిజానికి 'ఆపరేషన్ సిందూర్' సందరరేగా పాక్ సైన్యం వాడిన ఆయుధ సామగ్రిలో చైనా సరఫరా చేసినవి కూడా ఉన్నాయని అప్పుడే బయటపడింది. ఆ సామగ్రి 81 శాతం అని కూడా తేలింది. పాకిస్తాన్ మనపై ప్రయోగించిన ఆయుధ సామగ్రి చూశాక, ఈ ఘర్షణను 'సజీవ ప్రయోగశాల'గా చైనా ఉపయోగించుకున్నట్టు కనబడుతోందని కూడా మన దేశం విమర్శించింది. అలాంటి దేశం 'తగుదు నమ్మా...' అంటూ ఇరుపక్షాల మధ్యా రాజీకి దౌత్యం నెరపానని ఇప్పుడు గప్పాలు కొడుతోంది. లోపాయకారీగా ఘర్షణలను ఎగదోయటం, పైకి శాంతి వచనాలు వల్లించటం ఇటీవలి ధోరణేం కాదు. ఇలాంటి జిత్తులమారి ఎత్తుగడల్లో అమెరికా ఆరితేరింది. ఇజ్రా యెల్ సాగించే అన్ని దాడుల వెనకా ఆ దేశం ఉంటుంది. అవే దాడుల్ని ఆపినట్టు కనబడటంలో ముందుంటుంది. శాంతి సాధన కోసం 'ఏ సమస్యనైనా వస్తునిష'తో చూడటం, న్యాయమైన వైఖరి తీసుకోవటం' తమ విధానమని... లక్షణాలనూ, మూల కారణాలనూ తొలగించటమే తమ ధ్యేయమని వాంగ్‌యీ చెప్పుకున్నారు. డాలర్ ఇంకా శాసిస్తూనే ఉంది కనుక అమెరికా ఇలాంటి అబద్ధాలు చెప్పినా ఏదోమేరకు చెల్లు బాటవుతాయి. సుంకాలు పెంచుతామని బెదిరించానంటే 'అవును కాబోలు...' అని ఎవరికైనా అనిపించవచ్చు. కానీ చైనా సైతం 'అన్నీ నేనే... అంతా నేనే' అని అనటం ఎబ్బెట్టుగా ఉంటుంది. అదను చూసుకుని పక్కనున్న తైవాన్‌ను కబళించాలని ప్రయత్నిస్తూ, మనతో సరిహద్దుల్లో అకారణ వైరానికి దిగుతూ, అరుణాచల్ ప్రదేశ్‌లో గ్రామాల పేర్లు మార్చు కుని మురిసిపోతూ ఇలా తటస్థత నటించటం అనైతికత. చైనాకూ, తైవాన్‌కూ మధ్య రాజీ కుదర్చటానికి ప్రయత్నిస్తానని మన దేశం ముందుకొస్తే చైనా అంగీకరిస్తుందా? అధికారంలోకొచ్చిన నాటి నుంచీ నోబెల్ బహుమతి కోసం వెంపర్లాడటం ట్రంప్‌కు ఎక్కువైంది. బహుశా ఆయనకు మోకాలడ్డాలని చైనా ఏమైనా ప్రయత్నిస్తోందేమో! అలా చేయదల్చుకుంటే ట్రంప్ తప్ప వేరెవరూ చైనాను ఆటంకపరచరు. తామిచ్చే శాంతి బహుమతి సైతం ప్రతిష్ఠాత్మకమైనదిగా ఉండేలా చూసుకొనే బాధ్యత నోబెల్ కమిటీది. ఈలోగా లేని పెద్దరికాన్ని ప్రదర్శించటం వల్ల నవ్వులపాలు కావటం ఖాయమని అటు ట్రంప్, ఇటు చైనా తెలుసుకోవాలి.

# రాజకీయ రక్తబంధం...



ముంబై:రాజకీయాల్లో శాశ్వత మిత్రులే కాదు... శాశ్వత శత్రువులు కూడా ఉండరు. అందులోనూ అధికారం విషయంలో రాజకీయాలను సైతం రక్తసంబంధాలు నిర?యిస్తాయని చరిత్ర చెప్పిన సత్యం. దేశంలోనే అత్యంత సంపన్న నగరపాలక సంస్థ 'బృహన్ ముంబయ్ కార్పొరేషన్' (బీఎమ్సీ) ఎన్నికలకు అతి కొద్ది వారాలే ఉన్న నేపథ్యంలో ఆ మహానగర రాజకీయ దృశ్యంలో అక్షరాలా అదే కనిపిస్తోంది. మహారాష్ట్రలోని రెండు అత్యంత శక్తిమంతమైన రాజకీయ కుటుంబాలు మళ్ళీ ఒక్కటయ్యాయి. చీలికలు పేలికలైన శివసేన, జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లలో నిన్నటి దాకా కత్తులు దూసుకున్న పరస్పర ప్రత్యర్థి పవార్ కుటుంబ వర్గాలు, ఠాక్రే కుటుంబ వర్గాలు స్థానిక ఎన్నికలతో కలసి కాలు కదుపుతున్నాయి. దూరదృష్టి కన్నా రాజకీయ ఉనికిని కాపాడుకోవాల్సిన అవసరం, రక్తసంబంధం ఆసరాగా పొడిచిన ఈ కొత్త పొత్తులతో అధికార కూటమిలోని పార్టీలు, ప్రతిపక్షంలోని పార్టీలు తమలో తామే పోటీపడుతున్నాయి. చివరకు ఎవరు అధికార పక్షం, ఎవరు ప్రతిపక్షమనే స్పష్టత లేని పరిస్థితి. ఓటర్లే తికమకపడే దుఃస్థితి. ముందుగా ఉద్ధవ్ ఠాక్రే, శివసేన నుంచి 2006లో బయటకు వెళ్ళిపోయిన ఆయన సమీప బంధువు రాజ్‌ఠాక్రేలు దాదాపు రెండు దశాబ్దాల తమ శత్రుత్వానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. ఇక, కొన్నేళ్ళుగా బాహాటంగా కత్తులు దూసుకున్న శరద్‌పవార్, ఆయన మేనల్లుడు అజిత్ పవార్‌కు మధ్య కూడా సంధి కుదిరింది. ఠాక్రేల విషయానికే వస్తే ముందు నుంచి బాహాటంగా శుభాభినందనలతో మొదలుపెట్టి, ఉద్ధవ్ జన్మదిన సంద రరేగా 13 ఏళ్ళ తర్వాత మాతోశ్రీ నివాసానికి రాజ్ వెళ్ళడం దాకా ఓ పద్ధతి ప్రకారం రాజకీయ అడుగులు పడ్డాయి. అదేమంటే, మహారాష్ట్ర, మరాఠీ ప్రజల ప్రయోజనాల కోసమే ఈ పొత్తు అని నేతలిద్దరూ బల్లగుద్దారు. ఇప్పటికే మహారాష్ట్రపై పట్టు కోల్పోయిన ఠాక్రేలు ఉమ్మడి శివసేన కాలంలో కంచుకోట లాంటి ముంబయ్‌నైనా కాపాడుకోవడానికే ఒక లెక్కప్రకారం ఈ పనికి దిగారు. కొన్నేళ్ళ క్రితం ఏక్‌నాథ్ శిందే పార్టీని చీల్చి చావుదెబ్బ తీసి, బీజేపీతో దోస్తీ కట్టడంతో... పార్టీ పేరు, చిహ్నం సైతం కోల్పోయి, శివసేన (యూబీటీ) పేరిట ఆ మధ్య అసెంబ్లీ ఎన్నికల్లో తన ఉనికిని నిలుపుకొనేందుకు ఉద్ధవ్ అస్తుబిస్తు అయ్యారు. మరోపక్క రాజ్ ఠాక్రే సారథ్యంలోని మహారాష్ట్ర నవనిర్మాణ సేన సైతం అసెంబ్లీ ఎన్నికల్లో 1 శాతం చిల్లర ఓట్లే సంపాదించి, నామమాత్రావశిష్టమైంది. అందుకే, ఠాక్రేల కుటుంబానికి ఈ తాజా ఎన్నికల దోస్తీ రాజకీయ అనివార్యత. ముంబయ్, థానే, కల్యాణ్, ముంబయ్‌లోని ఇతర శివారు ప్రాంతాలతో పాటు పుణే, నాసికే, ఛత్రపతి శంభాజీ నగర్ తదితర ప్రాంతాల్లో నగరపాలిక ఎన్నికలు జరగ నున్నాయి. నిజానికి, ఇవంతా కలిపితే మొత్తం మహారాష్ట్రలో నాలుగోవంతు విస్తీర?ం కూడా కాదు. కానీ, అనేక పరిశ్రమలకు నెలవైన అవి సంపన్న ప్రాంతాలు కావడంతో అన్ని పార్టీలకూ ఈ ఎన్నికలు కీలకమయ్యాయి. పవార్‌ల కుటుంబం సైతం కలిసింది అందుకే. రెండేళ్ళ క్రితం 2023లో పార్టీని చీల్చి, బహిరంగంగా వ్యక్తిగత విమర్శలకు దిగిన అజిత్ పవార్‌కు సైతం నిరుటి లోక్‌సభ ఎన్నికల్లో తలబొప్పి కట్టాక తత్వం బోధ పడింది. రాజకీయ ఆచరణవాదాన్ని ఆశ్రయించి, రానున్న పుణే, పింప్రీ ఛింఛ్వాడీ మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో శరద్ పవార్ పార్టీతో కలసి పోటీ చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ రెండు పేరున్న రాజకీయ కుటుంబాల పునరేకీకరణ లక్ష్యం ఒకటే. బీజేపీ ప్రాబల్యానికి గండి కొట్టడమే. అది అంత సులభసాధ్యం అనిపించట్లేదు. చిత్రమేమంటే, బీజేపీ పాలిత రాష్ట్రంలో డిప్యూటీ సీఎంగా ఉంటూనే బీజేపీపైన అజిత్ ఇలా పోటీకి దిగుతున్నారు. అలాగే శరద్ పవార్ తీర్చిదిద్దిన మహా వికాస్ అఘాడీలో ప్రధాన భాగమైన కాంగ్రెస్‌తో పవార్‌లు ఢీ అంటే ఢీ అంటున్నారు. రాజకీయాలంటే అంతే. అక్షరాలా థ్రిల్లర్ సినిమా లాంటివి. అంతా సాఫీగా సాగుతోంద నుకున్నవేళ కథలో ఊహించని మలుపు చోటుచేసుకుంటుంది. అందులోనూ ఎన్నికల వేళ ఈ ట్విస్టులు నాటకీయతను పెంచుతాయి. కొత్త ఏడాది జనవరిలోనే వివిధ స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నందున రానున్న రోజుల్లో ఇలాంటి పరిణామాలు మరిన్ని చోటుచేసుకోవడం ఖాయం. అటుపైన ఎన్నికల ఫలితాలను బట్టి మొత్తం కథే మారినా ఆశ్చర్యం లేదు.

# లొసుగులమయంగా బెంగాల్ ఎస్ఐఆర్



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తీవ్రమైన అవకతవకలు, లోపాలు, లొసుగులు, అసమానతలు నెలకొన్నాయి. మతువాలు పూర్వపు తూర్పు బెంగాల్ నుండి వచ్చిన వలసదారులను మినహాయించడం అటువంటి అవకతవకల్లో ఒకటి. ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని వార్తలు వస్తున్నాయి. ఎస్ఐఆర్ ప్రక్రియను, సజావుగా, ఎలాంటి అవకతవకలు లేకుండా జరిపేందుకు మరింత సమయం కేటాయించాలని సిపిఎం సీనియర్ నేత కాంతి గంగూలీ డిమాండ్ చేశారు. టిఎంసి ఎంపీల ప్రతినిధి బృందం బుధవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను కలిసి ఒక మెమొరాండం సమర్పించింది. ఎస్ఐఆర్‌లోని అవకతవకలను సరిదిద్దాలని కోరింది.మతువాల భయాందోళనలు : తమ కమ్యూనిటీలో చాలామందికి 'వారసత్వ డేటా' లేనందున ఓటర్ల జాబితాలో తమ పేర్లు తొలగిస్తారనే భయాందోళనలు బంగ్లాదేశ్‌కు చెందిన హిందూ శరణార్థులు ప్రధానంగా వున్న మతువా కమ్యూనిటీలో వ్యక్తమవుతున్నాయి. సబార్ ఇనిస్టిట్యూట్ నిర్వహించిన ఒక అధ్యయనంలో వెల్లడైన అంశాలు వీరి ఆందోళనలను మరింత పెంచాయి. మతువాల ఆధిపత్యం కలిగిన నియోజకవర్గాల్లో గణనీయంగా ఓటర్ల తొలగింపులు జరిగినట్లు ఆ సర్వేలో వెల్లడైంది. వీరిలో చాలామందిని 'శాశ్వతంగా తరలిపోయారు' లేదా 'ఆచూకీ తెలియలేదు' అనే కేటగిరీల్లో చేర్చారు. ఇప్పటికే సామాజికంగా, ఆర్థికంగా వెనకబడి వున్న ఈ కమ్యూనిటీకి చెందిన వారి పేర్లు తాజాగా ఓటర్ల జాబితాలో లేకపోవడం గమనార్హం.

ఎస్ఐఆర్ ప్రక్రియలో వ్యవస్థాగత తప్పులు

వ్యవస్థలోని సాంకేతిక సమస్య ముఖ్యంగా 2002నాటి ఓటర్ల జాబితా డేటా అసంపూర్తిగా మార్పిడి కావడంతో మ్యాపింగ్ సమస్య తలెత్తింది. ఓటర్లుగా జాబితాలో చేర్చాల్సినవారిని 'మ్యాపింగ్ చేయనివారు'గా ముద్ర వేసే పరిస్థితికి దారి తీసింది. ఈ వ్యవస్థాగతమైన తప్పు వృద్ధుల్లో, వికలాంగుల్లో ఆందోళనలకు, ఇబ్బందులను కలిగించే అవకాశం వుంది.

స్థానిక ఎన్నికల అధికారుల ఆందోళనలు

ఒక వ్యక్తి చట్టబద్ధమైన ఓటరు అవునా, కాదా అని నిర?యించగలిగే స్థానిక ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల (ఇఆర్ఓ) చట్టబద్ధమైన పాత్రను ఈ ప్రక్రియలో పక్కకు నెడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు పాత్ర లేకుండా చేయడం, ఓటర్ల తొలగింపు నోటీసులు ఆటోమేటిక్‌గా రూపొందే కేంద్రీకృత పోర్టల్ ఎన్నికల కమిషన్ వద్దే వుండడం పట్ల ఇఆర్ఓలు, ఎఇఆర్ఓలు ఆందోళనలు, అభ్యంతరాలు వెలిబుచ్చుతున్నారు. ఓటరు పేరు తొలగింపు నోటీసులు జారీ చేయాల్సిన బాధ్యత చట్టప్రకారం ఇఆర్ఓలది, జాబితానుండి

# పుతిన్ నివాసంపై డ్రోన్ దాడులు

మాస్కోయుద్ధం ముగించేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇల్లే లక్ష్యంగా డ్రోన్ దాడులు జరగడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది ఉద్రిక్తతలను మరింత పెంచేదిగా మారింది. ఉక్రెయిన్ దళాలు ఈ దాడికి పాల్పడ్డాయంటూ రష్యా ఆరోపించిన సంగతి తెలిసిందే. వీటిని పలు దేశాలు ఖండిస్తున్న నేపథ్యంలో.. దాడి నిజమేనని నిరూపించుకునే పనిలో పడింది రష్యా. ఇందులోభాగంగా దాడికి సంబంధించి లభ్యమైన కొన్ని ఆధారాలను అమెరికాకు అందజేసింది. ఈ మేరకు ఆ దేశ రక్షణ మంత్రిత్వశాఖ ఓ వీడియో విడుదల చేసింది. రష్యా సైనిక నిఘా సంస్థ అధిపతి అడ్మిరల్ ఇగోర్ కోస్ట్యుకోవ్ మాస్కోలోని యూఎస్ మిలిటరీ అటాచ్ అధికారులతో భేటీ అయ్యారు. ఈసందర్భంగా కోస్ట్యుకోవ్ మాట్లాడుతూ.. దాడికి ఉపయోగించిన మానవరహిత విమానం శకలాలను తాము కనుగొన్నట్లు తెలిపారు. తమ దళాలు కూల్చివేసిన అనేక డ్రోన్లలోని నేవిగేషన్ వ్యవస్థలు చెక్కుచెదరకుండా ఉన్నాయన్నారు. వీటిని తమ ప్రత్యేక నిపుణులతో పరిక్షించగా.. డ్రోన్ల దాడి లక్ష్యం నోవ్‌గొరొడ్ ప్రాంతం లోని పుతిన్ నివాసమేనని నిర్ధరణ అయ్యిందన్నారు. ఈ సందర్భంగా ఆ వివరాలన్నింటినీ కోస్ట్యుకోవ్ అమెరికాకు అప్పగించారు. ఇక, ఉక్రెయిన్ ఈ దాడి చేసిందంటూ రష్యా చేస్తున్న ఆరోపణలను ఆ దేశం ఖండించింది. నాటో దేశాలు కూడా మాస్కోకు మద్దతివ్వలేదు. మరోవైపు కీవ్ దాడికి యత్నించినట్లు ఎలాంటి ఆధారాలు లేవని యూఎస్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కూడా వెల్లడించినట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో దాడి ఆధారాలను రష్యా అమెరికాకు ఇవ్వడం గమనార్హం. ఉక్రెయిన్, రష్యా మధ్య యుద్ధం ముగించడానికి చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఈ దాడితో అమెరికాకు కూడా మింగుడుపడడం లేదు. ఇది ట్రంప్ తీసుకున్న చర్యలకు విఘాతంగా మారనుంది.

# ప్లస్ పాయింట్ అదే!

అమరావతి,టిడిపి కూటమి ప్రభుత్వం చెప్పుకునేందుకు చాలా అంశాలు ఏపీలో ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటుతోంది. అయితే ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్తరాంధ్రకు వెళితే ఐటీ హబ్, ఐటీ పరిశ్రమల ఏర్పాటు నిరంతర ప్రక్రియ గా కొనసాగుతోంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం సైతం తుది దశకు వచ్చింది. అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో రెండేళ్లలో ఒక కొలిక్కి రానున్నాయి. మరోవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సైతం అదే స్థాయిలో ముందుకు సాగుతోంది. రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కానుంది. పెద్దఎత్తున తయారీ పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. టిడిపి కూటమి చెప్పుకునేందుకు సరైన అంశాలు ఇవి.

అప్పుడు కేవలం సంక్షేమమే..

ఏ ప్రభుత్వం అయినా ప్రజలకు మేలు చేయడమే అంతిమ లక్ష్యం. దానికిగాను ప్రభుత్వాలు వేర్వేరు మార్గాల్లో వెళ్తుంటాయి. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కేవలం సంక్షేమమే నడిచేది. చాలా రకాల సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా నడిపించారు జగన్మోహన్ రెడ్డి. అంతవరకు ఓకే కానీ.. అభివృద్ధి పరంగా మాత్రం ఎటువంటి ఫలితం కనిపించలేదు. అన్ని రకాల నిధులను సంక్షేమ పథకాలకు బదలాయించేవారు. కనీస స్థాయిలో ఇతర రంగాలకు కేటాయింపులు జరిగేవి కావు. నిధుల కొరతతో ప్రజలకు మౌలిక వసతులు సమకూరేవి కూడా కావు. ప్రజలు సంక్షేమ పథకాలను తీసుకున్నారు. కానీ అభివృద్ధిని ఆశించారు. అలా రెండింటిని సమప్రాధాన్యం ఇవ్వడంలో మాత్రం జగన్మోహన్ రెడ్డి విఫలమయ్యారు. దాని ఫలితాలు 2024 ఎన్నికల్లో చవిచూశారు.

రెండింటికి సమ ప్రాధాన్యం..

నిజంగా టిడిపి కూటమి ప్రభుత్వానికి జగన్ పాలన ఒక గుణపాఠం. అందుకే టిడిపి కూటమి ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ముందుకు వెళ్తోంది. అమరావతి రాజధాని నిర్మాణం చేపడుతోంది. వాస్తవానికి జగన్మోహన్ రెడ్డికి అత్యంత మైనస్ రాజధాని అంశం. అమరావతిని తీవ్రంగా వ్యతిరేకించారు. మూడు రాజధానులు అన్నారు. వాటిని కూడా కార్యరూపం దాల్చనీయలేదు. ఉన్న అమరావతిని నిర్వీర్యం చేశారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. అందుకే దానిని ప్రాధాన్యత అంశంగా తీసుకుని చంద్రబాబు సర్కార్ అమరావతి రాజధాని నిర్మాణాన్ని శరవేగంగా జరిపిస్తోంది. 2028 నాటికి అమరావతి అనేది ఒక కొలిక్కి రానుంది.

ఎన్నికల్లో చెప్పుకునేందుకు..

ఉత్తరాంధ్రలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం టిడిపి కూటమికి ప్లస్ పాయింట్ గా నిలవనుంది. ఎందుకంటే 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయాలని సంకల్పించింది. అయితే పనులు మొదలుపెట్టింది. ఇంతలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. జగన్మోహన్ రెడ్డి సర్కార్ పూర్తిస్థాయిలో కృషిచేసి ఉంటే ఈపాటికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చేది. కానీ ఇప్పుడు దానిని పూర్తిచేసే బాధ్యత టిడిపి ప్రభుత్వం తీసుకుంది. రెండు రోజుల్లో విమానం ల్యాండింగ్ కానుంది. వేసవి నుంచి విమాన రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ఇంకోవైపు పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయి. అవి కూడా 2028 నాటికి కొలిక్కి వస్తాయి. అంటే కూటమి ప్రభుత్వం మేము ఇది చేశాం అని చెప్పుకోడానికి కీలకమైన ప్రాజెక్టులు కనిపిస్తున్నాయి. ఆపై ఆలస్యంగా ప్రారంభమైనా సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయి. ఇది ఎంత మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నష్టమే.

# బొలెరోను ఢీకొన్న ఐచర్ వ్యాన్

అనంతపురం, మడకశిర మండలం అగ్రంపల్లి గ్రామం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బొలెరో గూడ్స్ వాహనాన్ని ఐచర్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వాహనాల్లో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించి.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని.. పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల్లో ఒకరు మడకశిర పట్టణానికి చెందిన వడ్రపాలెం రఘురాం, మరొకరు సీకే పల్లికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంపై ఆయా కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నంద్యాల జిల్లాలోని చాబోలు వద్ద జాతీయ రహదారిపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి.. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. రహదారిపై ట్రాఫిక్ జామ్ కావడంతో.. వాహనాలు బారులు తీరాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

# ప్రతిష్టకు ఎగనామం..మల్కాజిగిరిగా మారిన రాచకొండ కమిషనరేట్




హైదరాబాద్, జీహెచ్ఎంసీ మాదిరిగానే పరిపాలన సౌలభ్యం కోసం రాజధానిలోని మూడు పోలీసు కమిషనరేట్లను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. కొత్త జోన్లు, డివిజన్లు, పోలీసుస్టేషన్లు... పరిధులతో రూపురేఖలు మార్చింది. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధులు మారగా... రాచకొండ స్థానంలో మల్కాజిగిరి కమిషనరేట్ వచ్చింది. ఈ పేరుపైనే అనేక విమర్శలు వస్తున్నాయి. మరోపక్క మేడ్చల్ పోలీసుస్టేషన్‌ను సైబరాబాద్ కమిషనరేట్‌లో కలపడంపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేకంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉండటం, మల్కాజిగిరి పేరుతో కమిషనరేట్ ఏర్పాటు చేస్తున్నప్పుడు మేడ్చల్‌ను సైబరాబాద్‌లో చేర్చడం విమర్శలకు తావిచ్చింది. మరోవైపు ఈ కమిషనరేట్లలో అధికారికంగా నేటి (శుక్రవారం) నుంచి కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి.

అప్పట్లోనే అనేక విమర్శలు..

ఒకప్పుడు హైదరాబాద్ కమిషనరేట్ మాత్రమే ఉండేది. 2002లో సైబరాబాద్ కమిషనరేట్‌కు రూపమిచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రభుత్వం 2016లో సైబరాబాద్‌ను విడగొడుతూ నల్లగొండలోని కొన్ని ప్రాంతాలను కలిపి మరో కమిషనరేట్ ఏర్పాటు చేసింది. తొలినాళ్లల్లో దీన్ని సైబరాబాద్ ఈస్ట్ అన్నా..ఆపై రాచకొండగా మార్చారు. దీనికి ఆ పేరు పెట్టడంపై అప్పట్లో అనేక విమర్శలు సైతం వచ్చాయి. ఇప్పుడు హైదరాబాద్. రాచకొండల్లో ఉన్న ప్రాంతాలతో ఏర్పడిన కొత్త కమిషనరేట్‌కు మల్కాజిగిరి అని పేరు పెట్టడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

జగమెరిగిన సికింద్రాబాదే మేలు..

దేశంలోనే కాదు.. ప్రపంచం పటంలోనే హైదరాబాద్‌తో పాటు సికింద్రాబాద్ పేరు సుపరిచితమే. రైల్వేస్టేషన్, మహంకాళి దేవాలయం, పరేడ్ గ్రౌండ్స్, కంటోన్మెంట్ బోర్డు, బైసన్ పోలో, జింఖానా గ్రౌండ్స్ ఉండటం దీనికి ప్రధాన కారణం. మరోపక్క సికింద్రాబాద్‌కు బ్రిటిషర్ల కాలం నుంచీ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. కొత్తగా ఏర్పడిన కమిషనరేట్‌లో ఈ ప్రాంతాలు కూడా ఉన్నాయి. దీంతో సికింద్రాబాద్ పేరు ఖరారు చేస్తే ఉత్తమం అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బృహత్ జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించి గ్రేటర్ హైదరాబాద్, గ్రేటర్ సికింద్రాబాద్, గ్రేటర్ సైబరాబాద్‌గా మార్చడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోందనే విషయం గమనార్హం.

ఇబ్బందులు..

హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ మధ్య సిబ్బంది విభజన విషయంలో కొన్ని సాంకేతిక ఇబ్బందులు వస్తున్నాయి. దీంతో ప్రస్తుతానికి తాత్కాలిక ప్రాతిపదికన కేటాయించుకుని, భవిష్యత్తులో తుది చర్యలు తీసుకోనున్నారు.

ఇలా విస్తరించి ఉండటంతో...

హైదరాబాద్, సైబరాబాద్ మొత్తం చార్మినార్ జోన్‌లో భాగం. రాచకొండ మాత్రం చార్మినార్ జోన్‌తో పాటు యాదాద్రిలోనూ విస్తరించి ఉంది. ఈ కమిషనరేట్ మల్కాజిగిరిగా మారే వరకు యాదాద్రి ప్రాంతం కూడా ఇందులో భాగంగానే ఉండేది. దీంతో ఈ కమిషనరేట్‌లో రెండు జోన్లు ఉండేవి. పునర్వ్యవస్థీకరణ తర్వాత రాచకొండలోని కొన్ని ప్రాంతాలు మల్కాజిగిరిలో, కొన్ని హైదరాబాద్‌లో వచ్చి కలిశాయి. దీంతో ఇక్కడి సిబ్బంది సాంకేతికంగా హైదరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లలో పని చేస్తున్నా... వారి నియంత్రణ అధికారం మాత్రం చార్మినార్, యాదాద్రి జోన్లకు సంబంధించిన డీఐజీలకే ఉంటుంది. దీంతో భవిష్యత్తులో వీరికి పదోన్నతులు కల్పించాలంటే ఈ రెండు జోన్లకు చెందిన డీఐజీలకు జాబితా పంపి, దాని ఆధారంగానే ముందుకు వెళ్లాల్సి ఉండటంతో సీనియారిటీ జాబితా తయారీలో సాకేంతిక ఇబ్బందులు వస్తాయి.

సైబరాబాద్‌లో కలుస్తున్న 'జిల్లా'..

మల్కాజిగిరి కమిషనరేట్‌లోనూ ఇలాగే హైదరాబాద్, యాదాద్రి జోన్లకు ఎంపికైన వాళ్లు ఉన్నారు. మరోపక్క సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లోకి పటాన్‌చెరు, అమీన్‌పూర్, ఆర్సీపురం తదితర ప్రాంతాలను తీసుకువచ్చి కలిపారు. కానిస్టేబుల్ స్థాయి అధికారుల రిక్రూట్‌మెంట్ రెవెన్యూ జిల్లా, యూనిట్ స్థాయిలో జరుగుతుంది. ప్రస్తుతం సైబరాబాద్‌లో పని చేస్తున్న కానిస్టేబుళ్లు భౌగోళికంగా ఆ కమిషనరేట్‌కు చెందిన స్థానికులు అవుతారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన వాళ్లు అమీన్‌పూర్, పటాన్‌చెరువు, ఆర్సీపురం ఠాణాల్లో పని చేస్తూ ఉంటారు. ఈ కారణంగా వీరి సీనియారిటీ జాబితా తయారీ, పదోన్నతులు సైతం చార్మినార్ జోన్‌తో పాటు సంగారెడ్డిలకు పంపాల్సి ఉంటుంది. ఈ సాంకేతిక కారణాలను అధిగమించాలంటే జోన్లను పునర్వవస్థీకరించాల్సి ఉంది. ఆ మేరకు ప్రతిపాదనల్ని కేంద్రానికి పంపి ఆ మొత్తం పొంది రాష్ట్రపతి ద్వారా ఉత్తర్వులు వెలువడాలి. దీనికి సమయం పట్టే అవకాశం ఉండటంతో ప్రస్తుతానికి తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బంది విభజన చేసుకోనున్నారు.

# కొత్త ఏడాదికి అదిరి పోయే కానుక

అమరావతి,ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం కొత్త ఏడాదిలో ప్రజలకు ఒక మంచి కానుకను ప్రకటించింది. దీరకాలంగా భూ వివాదాలతో దానికి సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న ప్రజల కోసం ప్రభుత్వం కీలక నిర?యం తీసుకుంది. 22ఎ జాబితా నుండి ఐదు రకాల భూముల తొలగిస్తూ సంచలన నిర?యం ప్రకటించింది. అంతే కాదు మరో నాలుగు రకాల భూములపై త్వరలో నిర?యం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. మరో రెండు నెలలలో ఫ్రీ హోల్డ్ భూములపైనా నిర?యం ఉంటుందని స్పష్టం చేసింది. దాంతో కొత్త ఏడాది 2026 22ఎ జాబితా భూములను కలిగి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు వరంగా మారింది.

భూ నామ సంవత్సరంగా :

ఇక 2026 ని భూ నామ సంవత్సరంగా కూటమి ప్రభుత్వం డిక్లేర్ చేసింది. రైతులకు, భూ యజమానులకు ఉపశమనం కలిగించాలన్న ఉద్దేశ్యంతోనే ఈ నిర?యం తీసుకున్నట్లుగా కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఇక ఈ నిర?యం కారణంగా మాజీ ప్రస్తుత సైనికోద్యోగులకు స్వాతంత్ర్య సమర యోధులకు, రాజకీయ బాధితులకు కేటాయించిన భూములు కలిగి ఉన్న వారికి మేలు చేకూరుతుంది. 1955 జూన్ నెల 18వ తేదీ నాటికి ముందు అసైన్ చేసిన భూములుగా ప్రయివేట్ పట్టా భూములుగా ఉన్న వాటిని 22ఎ జాబితా నుండి తొలగించినట్లుగా రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ చెప్పారు.

వీటి విషయంలో సీరియస్ గా :

అదే విధంగా కేవలం కొంత భూమి కోసం ఆయా సర్వే నెంబర్ లో ఉన్న మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచితే ఎంతో మంది ఇబ్బంది పడుతున్నారు అని ప్రభుత్వం గుర్తించింది. ఆ కొంత భూమిని సబ్ డివిజన్ చేసి దాన్ని మాత్రమే నిషేధిత జాబితాలో ఇక మీదట ఉంచనున్నారు. అలా కాకుండా ఉన్న మిగిలిన భూమినంతా కూడా నిషేధిత జాబితా నుండి తొలగించినట్లుగా మంత్రి తెలిపారు. అయితే షరతులు గల పట్టా భూములు, సర్వీసు ఇనామ్ భూములు, గతంలో నిషేధిత జాబితా నుండి తొలగించినప్పటికీ రీ సర్వే సమయంలో మరలా 22 ఎలో చేర్చిన చుక్కల భూములు, గతంలో 22ఎ జాబితా నుండి తొలగించని చుక్కల భూములపై త్వరలోనే ఒక సమావేశాన్ని నిర్వహించి నిర?యం తీసుకుంటామని ఆయన చెబుతున్నారు.

వీటికి పూర్తిగా వర్తింపు :

ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు భూ కేటాయింపుల కోసం జిల్లా సైనిక సంక్షేమ అధికారి చేసిన సిఫార్సుల రిజిస్టర్ లేదా 10 (1) రిజిస్టర్, అడంగల్, ఎస్ఎఫ్ఎ లాంటి పాత రెవెన్యూ రికార్డులు లేదా అసైన్మెంట్ రిజిస్టర్లు లేదా



డీఆర్ దస్త్రాలు రికార్డ్ ఆఫ్ హోల్డింగ్స్ లేదా రిజిస్ట్రేషన్ పత్రాలు 8 ఎ రిజిస్టర్ లేదా డికెటి పట్టాలలో ఏదైనా ఒకటి ఉన్నా ఆయా భూములను తప్పనిసరిగా 22 ఎ జాబితా నుండి తొలగించాలని కూటమి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఇక మీదట ఈ భూములకు సంబంధించి తమకు ఇంకా అనేక డాక్యుమెంట్లు కావాలని భూయజమానులను తిప్పుకోవద్దని రెవెన్యూ అధికారులను ప్రభుత్వం ఆదేశించారు. ఇలా ఐదు రకాల భూములకు సంబంధించి దాదాపు ఎనిమిది రకాల పత్రాల్లో ఏ ఒక్క పత్రమున్నా 22 ఎ జాబితా నుండి తొలగించాలని అధికారులకు ఆదేశాలు అయితే వెళ్ళాయి. ఫ్రీ హోల్డ్ భూములపైనా ఇప్పటికే గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ మీటింగులో అనేఅక సార్లు చర్చించామని తొందరలో సానుకూల నిర?యం ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది.

పట్టాదారు పాసు పుస్తకాలు :

ఇదిలా ఉంటే జనవరి 2 నుంచి 9వ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 21 లక్షల 80 వేల కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేసేందుకు ప్రభుత్వం నిర?యించింది. ఇక 9వ తేదీన ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారని చెబుతున్నారు. అదే విధంగా రిజిస్ట్రేషన్ల శాఖలోనూ చాలా మార్పులు ప్రభుత్వం తీసుకుని వస్తోంది. ఇక మీదట నకిలీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను రద్దు చేసే అధికారం నేరుగా కలెక్టర్లకు ఇస్తున్నారు. ఇక ఏపీలో ఎక్కడైనా డబుల్ రిజిస్ట్రేషన్లు కనుక ఉంటే వాటి మీద కఠిన చర్యలు ఉంటాయి అని ప్రభుత్వం స్పష్టంగా చెబుతోంది. సో భూ అక్రమణదారులు అయినా ఫేక్ రిజిస్ట్రేషన్ తో ఉన్న వారు అయినా డబుల్ రిజిస్ట్రేషన్ తో దందాలు చేసేవారు ఎవరైనా తస్మాత్ జాగ్రత్త అని అంటున్నారు.

# చైనా మంజా వాడితే కఠిన చర్యలు...

హైదరాబాద్,నైలాన్ 'చైనీస్' మాంజా, గాజు లేదా లోహంతో కోటింగ్ చేసిన పదునైన దారాల వినియోగం వల్ల రాష్ట్రంలోని ఇటీవల వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆకాశంలో ఎగిరే గాలిపటం ఆనంద హేతువైతే, అదే రోడ్డుపై పడే మాంజా దారం మృత్యవకు కారణం అవుతోంది. ఇది శోచనీయం. మనుషులు, జంతువులు, పక్షుల ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తోంది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మియాపూర్ ? చందానగర్ ప్రధాన రహదారి, మాదాపూర్, హైటెక్ సిటీ, కూకట్‌పల్లి, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో ఇటీవలి కాలం లో ద్విచక్ర వాహనదారుల మెడలకు చైనీస్ మాంజా చిక్కి తీవ్ర గాయాలపాలైన ఘటనలు కలకలం రేపాయి. బాలానగర్ రహదారిపై ట్రాఫిక్ మధ్యలో ద్విచక్ర వాహనదారుడి మెడకు దారం తగలడం వలన మెడకు తీవ్ర గాయమయ్యింది. అపార్ట్ మెంట్లు, మేడలపై నుంచి గాలిపటాలు ఎగురవేయడం కారణంగా మాంజా చెట్ల కొమ్మలకు, విద్యుత్ తీగలకు చిక్కి రోడ్డుపై వేలాడటం కారణం గా ప్రమాదాలకు దారి తీస్తోంది. చైనీస్ మాంజా నైలాన్, సింథటిక్స్ ÷బైర్‌తో తయారవడంతో పాటు గాజుపొడి, లోహచూర్ణం పూత ఉండటంతో అత్యంత పదునుగా, ప్రమాదకరంగా మారుతోంది. ఈ మాంజా ఒక్కసారిగా వేగంగా మెడకు చుట్టుకుంటే తీవ్ర రక్తస్రావం జరిగి ప్రాణాపాయం ఏర్పడే ప్రమాదం ఉంది. మానవులకే కాదు, పక్షులు, ఇతర మూగజీవలకూ ఈ మాంజా వల్ల తీవ్రంగా నష్టపోతున్నాయి. పిచ్చుకలు, కాకులు, గద్దలు, రెక్కలకు దారాలు చిక్కి ఎగరలేక మృతి చెందుతున్న ఘటనలు నమోదవుతున్నాయి. వీధి కుక్కలు, పశువుల కాళ్లకు దారాలు చుట్టుకుని గాయాలవుతున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల భద్రత దృష్ట్యా మాంజా అమ్మినా, వినియోగించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సైరాబాద్ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. సైబరాబాద్ లో ఈ సంవత్సరం చైనీస్ మాంజా విక్రయదారులపై 53 కేసులు నమోదయ్యాయి. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు తనిఖీలు చేపట్టారు. చైనీస్ మంజా అమ్మకాలపై నిషేదం ఉందని, అమ్మితే కఠినచర్యలు తప్పవని సైబరాబాద్ పోలీసుల సూచనలు చేశారు. చైనీస్ మాంజా, నైలాన్, గాజు లేదా మెటల్ కోటింగ్ ఉన్న చైనీస్ మాంజాను అమ్మవద్దు, కొనవద్దన్నరు. చైనీస్ మాంజా విక్రయం, నిల్వ, రవాణా చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ఇంటి పైకప్పులు, టెర్రస్ ల పై



గాలిపటాలు ఎగరవేసేటప్పుడు అదనపు జాగ్రత్తలు తప్పనిసరి. గోడ అంచులు లేని మి÷-దదె పై నుంచి కింద పడే ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పిల్లలు గాలిపటాలు ఎగరవేసే సమయంలో ప్రమాదాలు జరగకుండా తల్లిదండ్రులు లేదా పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాలి. రోడ్లు, ప్రధాన రహదారులు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో గాలిపటాలు ఎగరవేయ కూడదు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లు, సెల్ టవర్ల సమీపంలో గాలిపటాలు ఎగరవేయడం ప్రమాదకరం. విస్తృతమైన బహిరంగ ప్రదేశాలు, మైదానాలను మాత్రమే గాలిపటాలు ఎగురవేయడానికి అనువైనవి. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. తద్వారా ప్రమాదలను కొంతవరకు నివారించవచ్చు. రోడ్డుపై వేలాడుతున్న గాలిపటాల దారాలు కనిపిస్తే వెంటనే జీహెచ్ఎమ్ సీ అధికారులకు సమాచారం ఇవ్వాలి. తెగిపోయిన గాలిపటాల దారాలను రోడ్లు, చెట్లపై కనిపిస్తే సురక్షితంగా సేకరించి జాగ్రత్తగా డిస్పోజ్ చేయాలి. చెట్లపై లేదా విద్యుత్ తీగలపై చిక్కుకున్న దారాలను స్వయంగా తొలగించే ప్రయత్నం చేయకూడదు. వాహనదారులు గాలిపటాల సీజన్‌లో మితవేగంతో ప్రయాణించాలి. చిన్న పిల్లలను రోడ్లపై లేదా జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో గాలిపటాలు ఎగరవేయడానికి అనుమతించకూడదు. చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. చట్టవిరుద్ధంగా చైనీస్ మాంజా వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

# హై హై.. రైజింగ్



హైదరాబాద్, గ్రేటర్ పరిధిలో రియల్ఎస్టేట్ మందగించిందని చెబుతున్నప్పటికీ.. జీహెచ్ఎంసీ పరిధిలో గడచిన (2025) సంవత్సరంలో హైరైజ్ (బహుళ అంతస్తుల) భవనాలు పెరిగాయి. అంతకుముందు 2024 సంవత్సరంలో జీహెచ్ఎంసీ నుంచి 69 హై రైజ్ భవనాలకు అనుమతులివ్వగా, 2025లో 103 బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులిచ్చారు. ఇతర భవన నిర్మాణ అనుమతులు మాత్రం కొంత తగ్గాయి. 2024లో 11,855 భవన నిర్మాణ అనుమతులు జారీ కాగా, 2025లో 11,166 భవన నిర్మాణ అనుమతులు జారీ అయ్యాయి. ఇవి తగ్గినప్పటికీ, హైరైజ్ భవన నిర్మాణ అనుమతులు, లే ఔట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ పెరగడంతో టౌన్‌ప్లానింగ్ విభాగం ఆదాయం పెరిగింది. 2024లో రూ.1,114.24 కోట్ల ఆదాయం రాగా, 2025లో రూ. 1,272.36 కోట్ల ఆదాయం లభించింది. గత సంవత్సరం మార్చినుంచి అమల్లోకి వచ్చిన ఏఐ ఆధారిత బిల్డ్ నౌ అప్లికేషన్ ద్వారా భవన నిర్మాణ అనుమతులు.. ముఖ్యంగా భారీ భవంతులవి త్వరితంగా ఇవ్వడం సాధ్యమైందని అధికారులు పేర్కొన్నారు. 2024లో కేవలం 12 లేఔట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు అనుమతులివ్వగా 2025లో 30 లేఔట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు అనుమతులిచ్చారు. ఇక ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు 2024లో 2,125 జారీ కాగా, 2025లో 2,401 జారీ అయ్యాయి.

భూసేకరణ పనులు..

భవన నిర్మాణ అనుమతులతో పాటు టౌన్‌ప్లానింగ్ విభాగం వివిధ ప్రాజెక్టులకు, అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణలు కూడా పూర్తి చేసినట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది. వీటిలో ట్రాఫిక్ రద్దీ సమస్యను పరిష్కరించే జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్‌ల నుంచి హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)ప్రాజెక్ట్ కింద వివిధ ఫ్లై ఓవర్లు, ఆర్ఓబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలకు అవసరమైన స్థల సేకరణ చేసినట్లు తెలిపింది. వీటితో పాటు గోషామహల్‌లో నిర్మించనున్న ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కొత్త భవనానికి అప్రోచ్, లింక్‌రోడ్లకు ప్రాధాన్యమిచ్చి భూసేకరణల ప్రతిపాదనలు త్వరితగతిన పూర్తి చేసినట్లు పేర్కొంది.

రహదారుల విస్తరణకు..

ప్రధాన రహదారుల మార్గాల్లో రోడ్డు వెడల్పు, అభివృద్ధి పనులకు 2024లో ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించింది. ఈ పనులు త్వరితగతిన జరిగేందుకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియ జరుగుతోందని తెలిపింది. నాలుగు ప్రధాన రహదారులకు సంబంధించి 696 ఆస్తులకుగాను 134 ఆస్తుల సేకరణ పూర్తి కాగా.. మిగతా ఆస్తుల సేకరణ పనులు పురోగతిలో ఉన్నట్లు పేర్కొంది.

జంక్షన్ల పనులు..

జీహెచ్ఎంసీ పరిధిలో రూ.233 కోట్లతో 90 జంక్షన్లను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించగా, 74 జంక్షన్లలో పనులు చేసేందుకు ప్లాన్‌లను ఆమోదించారు.

# ఇరాన్‌లో ప్రజల తిరుగుబాటు.. ప్రభుత్వం కూలిపోక తప్పదా?



టెహ్రాన్: ఇరాన్.. పాకిస్తాన్ అనుకూల దేశం. ఉగ్రవాదులకు అడ్డా. ముస్లిం ఛాందసవాద దేశం. ఈ దేశంక్ష 2022-23లో హిజాబ్ వ్యతిరేక ఉద్యమం పెద్ద ఎత్తున జరిగింది. ఓ యువతి హిజాబ్ తొలగించడంతో పోలీసుల అరెస్టు చేసి తీవ్రంగా కొట్టారు. దీంతో ఆ యువతి చనిపోయింది. దీనికి వ్యతిరేంగా మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమించారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చింది. తాజాగా అంతకు మించిన ఉద్యమం కొనసాగుతోంది. రెండు రోజులుగా ప్రజలు తిరుగబాటు చేస్తున్నారు. అయితే దీనిని ఇరాన్ ప్రభుత్వం బయటకు రానివ్వడం లేదు. ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జిలు చేస్తున్నా ఆందోళనలు ఆగడం లేదు. 'ముల్లాస్ గో బ్యాక్', 'లీవ్ ఇరాన్', 'డెత్ టు డిక్టేటర్స్' నినాదాలు టెహ్రాన్, మాష్హద్, షిరాజ్, దిస్పాన్‌లో వినిపిస్తున్నాయి.

నాడు హిజాబ్‌పై రచ్చ..

2022లో మహ్సా అమిని హిజాబ్ ఉల్లంఘనపై పోలీసుల కస్టడీలో మరణించడంతో మహిళలు రోడ్లపైకి వచ్చారు. హిజాబ్‌లు తొలగించి, టీషర్ట్‌లు-జీన్స్‌లలో నిరసనలు చేశారు. పది నెలలు కొనసాగిన ఈ ఉద్యమం ప్రభుత్వాన్ని ఒత్తిడికి తీసుకువచ్చి, మత నిబంధనలు సడలించింది. ఇప్పుడు ఆందోళనలు ఆర్థిక సమస్యల వైపు మలిచాయి. మతోన్మాద విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీశాయి.

తాజాగా ఆర్థిక సంక్షోభం..

తాజాగా ఇరాన్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఒక డాలర్ 42,000 రియాల్‌కు చేరడంతో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరిగాయి. సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ రాజీనామా చేసి, 'వ్యవస్థను నడపలేకపోయాను' అని ప్రకటించాడు. ప్రభుత్వ ఒత్తిడి కారణమని అనుమానాలు. అయితే ఇరాన్ మీడియా ఈ వార్తలు దాచిపెట్టినా, గల్ేముస్లిం పత్రికలు విస్తృతంగా కవరేజ్ చేశాయి. ఇస్లామిక్ ఆర్థిక విధానాలు ప్రజల జీవితాలను కష్టతరం చేస్తున్నాయి.

చరిత్ర పునరావృతం?

1979లో ఇస్లామిక్ విప్లవంతో షా పాలిత రాచరికం అంతమైంది. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించారు. ఇప్పుడు ప్రజలు మతాధీన పాలనకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడుతున్నారు. మహిళలు, యువత ముందంజలో ఉండి, మత విశ్వాసాలను బలవంతం చేసే వ్యవస్థకు చాటి చూపుతున్నారు. ఈ ఉద్యమం విస్తరిస్తే, ఇరాన్ రాజకీయాలు మారే అవకాశం ఉంది.

# క్షేత్రస్థాయికి బీజేపీ.. స్థానిక సంస్థలపైనా పట్టు!

న్యూఢిల్లీ, భారతీయ జనతాపార్టీ.. ప్రపంచంలో అత్యధిక సభ్యంత్వం కలిగిన పార్టీ. 12 ఏళ్లుగా దేశంలో అధికారంలో ఉంది. ఉత్తరాది పార్టీగా పదేళ్ల క్రితం వరకు బీజేపీకి ముద్ర ఉండేది. కానీ తర్వాత దక్షిణాదిన కూడా పాగా వేసింది. మహారాష్ట్ర, కరా?టకలో అధికారంలోకి వచ్చింది. కేరళ, తెలంగాణ, తమిళనాడులో పాగా వేయాలని ప్రయత్నిస్తోంది. ఇదిలా ఉంటే.. దక్షిణాదిలో బీజేపీ అర్బన్ పార్టీగానే గుర్తింపు ఉంది. కానీ 2025 డిసెంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటింది. ప్రతిపక్ష కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టింది. ప్రాంతీయ పార్టీలను మించి సీట్లు గెలిచింది. దీంతో క్షేత్రస్థాయిలో పార్టీ బలపడుతోందన్న సంకేతాలు వస్తున్నాయి. మహారాష్ట్ర, కేరళ, కరా?టక, గోవా, అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించింది.

మహారాష్ట్రలో..

మహారాష్ట్రలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 117 స్థానాలతో ముందంజలో నిలిచింది. మిత్ర పక్షాలు ఈక్‌నాథ్ శిండే శివసేన, అజిత్ పవార్ ఎన్‌సీపీ కలిసి 200ం సీట్లు సాధించాయి. మహాఘట్‌బంధన్‌కు 37 మాత్రమే వచ్చాయి. ఈ మైత్రి విజయం బీజేపీ దక్షిణ, పశ్చిమ రాష్ట్రాల్లో బలపడుతుందనడానికి నిదర్శనం.

కరా?టకలో అధికార పార్టీకి షాక్..

కాంగ్రెస్ పాలిత కరా?టకలో పట్టణ స్థానిక సంస్థల్లో బీజేపీ 40 సీట్లతో ఆధిక్యం చెప్పింది. కాంగ్రెస్ 23, జేడీఎస్ ఒకటి, స్వతంత్రులు 2 మాత్రమే గెలిచారు. అధికార పార్టీని కాదని అక్కడి ఓటర్లు బీజేపీకి స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించారు.

గోవాలో..

ఉత్తరాది రాష్ట్రం గోవాలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఇక్కడ బీజేపీ-మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ కూటమి 32 సీట్లు సాధించింది. కాంగ్రెస్



10, ఆప్ 1, స్వతంత్రులు 4. అధికార బీజేపీ స్థానిక స్థాయిలో బలపడినట్టు నిదర్శనం.

అరుణాచల్ ప్రదేశ్..

అరుణాచల్‌లో జిల్లా కౌన్సిల్‌లో బీజేపీ 170 సీట్లు, పంచాయతీల్లో 6,085 సీట్లు గెలిచాయి. పీపీఏ 648, ఎన్‌పీపీ 160, స్వతంత్రులు 627, కాంగ్రెస్ 216 గెలిచాయి. ఈశాన్య రాష్ట్రంలో బీజేపీ ఆధిపత్యం పెరగడం గమనార్హం.

కేరళలో..

కేరళ పంచాయతీల్లో యూడీఎఫ్ 505, ఎల్‌డీఎఫ్ 345, స్వతంత్రులు 64, బీజేపీ 26 సీట్లు గెలిచాయి. తిరువనంతపురం మున్సిపాలిటీలో బీజేపీ గణనీయ పురోగతి చెందింది.

గతంతో పోలిస్తే చాలా పంచాయతీల్లో బీజేపీ విజయం షాధించింది. ఈ ఎన్నికలు బీజేపీ అట్టడుగుస్థాయి బలాన్ని చూపుతున్నాయి. అధికారంలో లేని రాష్ట్రాల్లో కూడా బీజేపీ బలపడింది. 2024 లోక్‌సభ తర్వాత పార్టీ స్థానిక స్థాయిలో దృష్టి పెట్టి, దక్షిణ-ఈశాన్యంలో పట్టు పెంచుకుంది. తెలంగాణలో కూడా ఇదే ట్రెండ్ కొనసాగుతోంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com